www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | ఆదివారం, అక్టోబర్ 4,2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:210 | పేజీలు: 8 | వెల: రూ.5/-

‘చుట్టమల్లె’ డీప్‌ఫేక్‌పై ఎన్టీఆర్

సోషల్ మీడియాలో సెలబ్రిటీల డీప్‌ఫేక్ వీడియోల వ్యవహారం కలకలం రేపుతోంది. తాజాగా జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ నటించిన ‘దేవర’ సినిమాలోని ‘చుట్టమల్లె’ పాటకు సంబంధించిన ఓ ఏఐ మార్ఫింగ్ వీడియో వైరల్‌గా మారింది. దీనిపై ఎన్టీఆర్ తీవ్రంగా స్పందించారు. మహిళలను అవమానించేందుకు ఏఐని ఉపయోగించడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ వీడియోను తయారు చేసిన వారితో పాటు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్న వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మహిళలను గౌరవించడం మన సంస్కృతిలో భాగమని ఎన్టీఆర్ పేర్కొన్నారు. అలాంటి మహిళలను అవమానించేలా ఏఐ టెక్నాలజీని ఉపయోగించడం అత్యంత దారుణమని అన్నారు. ఈ మార్ఫింగ్ వీడియో వెనుక ఉన్న వారిని పదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.ఇలాంటి చెడు కంటెంట్‌ను ఎవరూ చూడొద్దని ఎన్టీఆర్ కోరారు. ఎవరూ ఫార్వర్డ్ చేయొద్దని సూచించారు

విద్యా, వైద్యంపై జిల్లాల వారీగా ప్రతి వారం

సమీక్షించాలి

- ఆస్పత్రులనూ క్షేత్రస్థాయిలో పరిశీలించాలి..
- డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్..

గ్లోబల్ సమ్మిట్‌కు సీఎం స్పీడ్.. ఆస్పత్రుల పనులకూ డెడ్‌లైన్!

హైదరాబాద్, అక్టోబరు 3 (సామాన్యుడి అస్త్రం)

విద్యా, వైద్యంపై జిల్లాల వారీగా అధికారులు ప్రతి వారం సమీక్షించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో విద్యా, వైద్యంపై సీఎంవో అధికారులతో శనివారం యంసీహెచ్ఆర్డీ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. నిర్మాణంలోని ప్రధాన ఆస్పత్రులపై సీఎం ఆరా తీశారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రుల పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఆస్పత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది నియామకాలు పూర్తి చేయాలని మార్గనిర్దేశం చేశారు.



ఆస్పత్రులనూ క్షేత్రస్థాయిలో పరిశీలించాలి..

వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను ముందుగానే గుర్తించాలని సీఎం సూచించారు. అత్యాధునిక వైద్య పరికరాల కొనుగోలును వేగవంతం చేయాలని నిర్దేశించారు. ఆయా ఆస్పత్రులు పూర్తయ్యే నాటికి అన్ని వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ ఎక్విటీ హాస్టళ్లను అధికారులు తప్పనిసరిగా సందర్శించాలని ఆదేశించారు. జిల్లాల్లోని ఆస్పత్రులనూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు.

డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్..

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు.



- అమరావతి కేంద్రంగా కీలక ముందడుగు
- ఏపీకి టెక్నాలజీ బదిలీ చేసేందుకు 23 ఐఐటీల అంగీకారం

చంద్రబాబు సమక్షంలో చారిత్రక డిక్లరేషన్!

క్యు-శివ పేరుతో ఐదు క్వాంటం కంప్యూటర్ల ఆవిష్కరణ


అమరావతి,(సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, సాంకేతిక ప్రగతికి ఊతమిచ్చేలా దేశంలోని 23 ఐఐటీలు ముందుకొచ్చాయి. రాష్ట్రానికి అవసరమైన టెక్నాలజీని బదిలీ చేసేందుకు సంపూర్ణ అంగీకారం తెలుపుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ‘పాన్ ఐఐటీ ఏపీ 2026’ సదస్సులో ఒక చారిత్రక డిక్లరేషన్‌ను విడుదల చేశాయి. అమరావతిని గ్లోబల్ నాలెడ్జ్, డీప్‌టెక్ హబ్‌గా మార్చే లక్ష్యంతో విజయవాడలో జరిగిన ఈ సదస్సులో తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర భవిష్యత్తుకు మైలురాయిగా నిలవనుంది.శనివారం విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన ఈ సదస్సు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటనలు చేశారు. అమరావతిలో ‘పాన్ ఐఐటీ వరల్డ్ కౌన్సిల్’ ఏర్పాటు చేస్తున్నట్లు, డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా రూ.500 కోట్లతో ‘పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్’ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 100 మంది ఐఐటీయన్లతో ఒక గ్లోబల్ మెంటర్ల నెట్‌వర్క్‌ను కూడా ఏర్పాటు చేసి ఏపీలోని స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.ఈ సదస్సులో భాగంగా క్యూ-శివ పేరుతో రూపొందించిన ఐదు మినీ టెస్టింగ్ క్వాంటం కంప్యూటర్లను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్, చండీగఢ్ యూనివర్సిటీ సహకారంతో రూపొందించిన ఈ కంప్యూటర్లతో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్‌ను కూడా ఆవిష్కరించారు.‘మేడ్ ఇన్ అమరావతి’ బ్రాండ్‌ను సృష్టించేలా క్వాంటం కంప్యూటర్ల తయారీకి శ్రీకారం చుట్టడం రాష్ట్రంలో డీప్‌టెక్ ఉత్పత్తుల తయారీ సామర్థ్యానికి నిదర్శనమని సీఎం అన్నారు.

అమిత్ షా తెలంగాణ

పర్యటన రద్దు

- చివరి నిమిషంలో కీలక నిర్ణయం!
- మెదక్, కరీంనగర్‌లో పర్యటనకు ఏర్పాట్లు పూర్తి



న్యూఢిల్లీ,(సామాన్యుడి అస్త్రం)

కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు.షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

- బీసీలకు అధికారం దక్కకూడదని వైసీపీ కుట్ర చేసిందన్న రామ్మోహన్ నాయుడు
- రిజర్వేషన్ల కోసం కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాడుతోందని వెల్లడి
- టీడీపీకి బీసీలు వెన్నెముక వంటివారని వ్యాఖ్య

అమరావతి,(సామాన్యుడి అస్త్రం)

వైసీపీపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని ఆయన ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే గోవిందరావుతో కలిసి ‘పల్లె పండుగ 3.0’ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.



వరంగల్ ఎయిర్‌పోర్టు పనుల్లో ముందడుగు

- ప్రహరీ నిర్మాణానికి టెండర్ ఖరారు చేసిన ఏఏఐ
- రూ.13.28 కోట్లకే పనులు దక్కించుకున్న సైదాక్స్ ఇన్ఫ్రా

హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)

వరంగల్ (మామనూరు) ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనుల్లో కీలక ముందడుగు పడింది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) మొదటి దశ పనులకు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి కాంట్రాక్టు సంస్థను ఖరారు చేసింది. ఎయిర్‌పోర్టుకు కొత్తగా సేకరించిన భూమికి రక్షణ గోడ (బౌండరీ వాల్) నిర్మించే పనులను హైదరాబాద్‌కు చెందిన సైదాక్స్ ఇంజనీర్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకుంది.



వదంతులు నమ్మొద్దు

నా పోటీ హుజూర్‌నగర్ నుంచే

- వచ్చే ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేసిన ఉత్తమ్
- తుంగతుర్తి నియోజకవర్గానికి మారుతున్నాననే వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి



హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. వచ్చే ఎన్నికల్లో తాను హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. డీలిమిటేషన్ తర్వాత తుంగతుర్తికి మారవచ్చంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.ఈరోజు హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి... తన నియోజకవర్గం మార్పుపై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తన స్వగ్రామం తాటిపాములలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అంతమాత్రాన అక్కడి నుంచి పోటీ చేస్తాననడం అవాస్తవమని తెలిపారు.ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై కూడా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.

తిరుమలకు పోటెత్తిన భక్తులు

- సర్వదర్శనానికి 30 గంటలకు పైగా నిరీక్షణ సమయం
- ఆక్టోపస్ భవనం వరకు కిలోమీటర్ల మేర విస్తరించిన క్యూలైన్లు
- గోవింద నామస్మరణతో మార్మోగుతున్న సప్తగిరులు
- భక్తుల కోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లు



అమరావతి,(సామాన్యుడి అస్త్రం)

పెరటాసి మాసం మూడో శనివారం సందర్భంగా కలియుగ వైకుంఠం తిరుమల క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన ఈ మాసంలో, ముఖ్యంగా శనివారం నాడు స్వామివారిని దర్శించుకునేందుకు తమిళ నాడుతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో తిరుమల గిరులు భక్తజన సంద్రంగా మారాయి.శనివారం ఉదయం నాటికి శ్రీవారి సర్వదర్శనానికి సంబంధించిన అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు వెలుపలికి విస్తరించాయి. గోగర్భం డ్యామ్ సర్కిల్ సమీపంలోని ఆక్టోపస్ భవనం వరకు భక్తులు బారులు తీరిన దృశ్యాలు కనిపించాయి. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 30 గంటలకు పైగా సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు అంచనా వేస్తున్నారు.

శ్రీసిటీలో ఘోర ప్రమాదం

- శ్రీసిటీ పారిశ్రామిక వాడలో బాయిలర్ పేలి ఘోర ప్రమాదం
- ఈ దుర్ఘటనలో నలుగురు కార్మికులు దుర్మరణం

అమరావతి,(సామాన్యుడి అస్త్రం)

తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో శనివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో నలుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడంతో విషాదం నెలకొంది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ పేలుడు ధాటికి ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు.



అమరావతి ఓఆర్ఆర్‌కు టెండర్లు

- నాలుగు ప్యాకేజీలుగా 195 కి.మీ. రోడ్డు నిర్మాణం
- సివిల్ పనుల అంచనా వ్యయం రూ.11,537 కోట్లు

అమరావతి(సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, విజయవాడ, గుంటూరు నగరాల చుట్టూ నిర్మించ తలపెట్టిన అమరావతి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఈ భారీ ప్రాజెక్టు పనుల కోసం నాలుగు ప్యాకేజీలుగా టెండర్లను ఆహ్వానించింది.మొత్తం రూ.11,537.70 కోట్ల అంచనా వ్యయంతో సివిల్ పనులను చేపట్టనున్నారు.



విద్యా, వైద్యంపై జిల్లాల వారీగా ప్రతి వారం సమీక్షించాలి


మొదటి పేజీ తరువాయి

సమ్మిట్‌కు పెట్టుబడులే ప్రధాన అజెండా

సమ్మిట్‌కు నిర్వహణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం.. అంతర్జాతీయ అతిథుల ఆహ్వానం నుంచి పెట్టుబడుల ప్రతిపాదనల వరకు ప్రతి అంశంపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలని భావిస్తోంది. సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు తీసుకురావడంపై దృష్టి పెట్టాలని సీఎం సూచించినట్లు సమాచారం. ఏర్పాట్లను త్వరలో క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు తెలిపారు.

ఆస్పత్రుల నిర్మాణాలపై ప్రత్యేక నిఘా

ఎల్బీనగర్ టిమ్స్, అల్వాల్ టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణాల పురోగతిపై సీఎం సమీక్షించారు. నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. వరంగల్ ఆస్పత్రి నిర్మాణంలో



ఆలస్యంపై గతంలోనూ సీఎం సమీక్షించి, పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రుల భవనాలు సిద్ధమైన తర్వాత సిబ్బంది కొరత తలెత్తకుండా ముందుగానే నియామక ప్రక్రియను ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మానవ వనరులు, ఇతర సదుపాయాలపై అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

పాఠశాలలు, హాస్టళ్లు, ఆస్పత్రులకు క్షేత్రస్థాయి సందర్శనలు

ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లు, ప్రభుత్వ ఆస్పత్రులను అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో సందర్శించాలని సీఎం స్పష్టం చేశారు. కార్యాలయాల్లో కూర్చొని సమీక్షలు నిర్వహించడమే కాకుండా.. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను స్వయంగా గుర్తించి పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు అందుతున్న సేవలు, మౌలిక సదుపాయాల పరిస్థితిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా పెట్టుబడుల ఆకర్షణ.. ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలు.. పాఠశాలలు, హాస్టళ్లలో పర్యవేక్షణ --- ఈ మూడు అంశాలపై ప్రభుత్వం ఒకేసారి దృష్టి పెట్టినట్లు తాజా సమీక్ష స్పష్టం చేస్తోంది.

తిరుమలకు పోటెత్తిన భక్తులు

మొదటి పేజీ తరువాయి

పెరటాసి మాసం విష్ణుమూర్తి ఆరాధనకు ఎంతో పవిత్రమైనదిగా భక్తులు భావిస్తారు. ఈ మాసంలోని శనివారాల్లో శ్రీవారిని దర్శించుకుంటే విశేష ఫలాలు దక్కుతాయని ప్రగాఢంగా విశ్వసిస్తారు. ఈ నమ్మకంతోనే ప్రతీయేటా ఈ సమయంలో తిరుమలకు భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది.కాగా, శుక్రవారం (అక్టోబర్ 2) నాడు 78,445 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 40,098 మంది తలనీలాలు సమర్పించుకోగా, హుండీ ద్వారా రూ. 4.30 కోట్ల



కానుకలు సమకూరాయి. అదేవిధంగా, 4.16 లక్షల లడ్డూలు విక్రయించగా, 3.30 లక్షల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. అశ్విని ఆసుపత్రిలో 4,818 మంది వైద్య సేవలు పొందారు. ఈ గణాంకాలు తిరుమలలో భక్తుల రద్దీ ఏ స్థాయిలో ఉందో స్పష్టం చేస్తున్నాయి.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో ఉన్నవారికి నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు అందిస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని, భక్తులు సంయమనంతో వ్యవహరించి టీటీడీకి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... బీసీలకు రాజ్యాధికారం దక్కకూడదనే ఉద్దేశంతోనే గతంలో వైసీపీ ప్రభుత్వం రిజర్వేషన్లను అడ్డుకుందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కోటాపై గతంలో కోర్టు తీర్పు ఇస్తే, దానిపై అప్పటి జగన్ ప్రభుత్వం ఎందుకు పోరాడలేదని ఆయన ప్రశ్నించారు. బీసీలకు వైసీపీ తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలు కోసం సుప్రీంకోర్టులో పోరాటం చేస్తోందని తెలిపారు. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందే తెలుగుదేశం పార్టీ అని గుర్తుచేశారు. బీసీలు ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే టీడీపీ లక్ష్యమని స్పష్టం చేశారు. టీడీపీకి బీసీలే వెన్నెముక అని, తమది బీసీల పార్టీ అని అన్నారు. జగన్ అండ్ కో ఆటలు ఇకపై చెల్లవని హెచ్చరించారు.

శ్రీసిటీలో ఘోర ప్రమాదం.. దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన చంద్రబాబు, లోకేశ్

మొదటి పేజీ తరువాయి

ఘటనపై స్పందించిన సీఎం చంద్రబాబు
అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్న వైనం
బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మంత్రి లోకేశ్ హామీ
గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు

వివరాల్లోకి వెళితే, శ్రీసిటీలోని ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో ఉన్న వాటర్ బాయిలర్ శనివారం ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిపోయింది. ఈ పేలుడు ధాటికి ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ వారు కన్నుమూశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తికి ప్రస్తుతం చికిత్స కొనసాగుతోందని అధికారులు తెలిపారు.ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఆయన అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, వారికి అవసరమైన అన్ని రకాల సాయం అందిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఇది చాలా విషాదకరమైన సంఘటన అని పేర్కొన్నారు. "మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించాలని అధికారులను ఆదేశించాను. ప్రభుత్వం మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటుంది" అని లోకేశ్ హామీ ఇచ్చారు.అదేవిధంగా, రాష్ట్ర హోంమంత్రి అనిత కూడా ఈ ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తిరుపతి జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించడంతో పాటు, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై అధికారులు విచారణ జరుపుతున్నారు.

అమరావతి ఓఆర్ఆర్‌కు టెండర్లు..

మొదటి పేజీ తరువాయి

హైబ్రిడ్ యాన్యుటీ పద్ధతిలో మూడేళ్లలో పూర్తిచేయాలన్న లక్ష్యం
ఐదు జిల్లాల మీదుగా వెళ్లనున్న ఔటర్ రింగ్ రోడ్

శుక్రవారం నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 195.13 కిలోమీటర్ల పొడవున ఈ రహదారిని నిర్మించనున్నారు. ఇందులో 189.93 కి.మీ. ఆరు వరుసల ఓఆర్ఆర్ కాగా, నారాకోడూరు నుంచి బుడంపాడు వరకు 5.2 కి.మీ. నాలుగు వరుసల అనుసంధాన రహదారి కూడా ఉంది. నవంబర్ 18 వరకు బిడ్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించగా, 19న టెక్నికల్ బిడ్లను తెరవనున్నారు. కేంద్ర కమిటీల నుంచి తుది అనుమతులు త్వరలో రానున్నాయన్న అంచనాతో ఎన్‌హెచ్‌ఏఐ ముందుగానే టెండర్ల ప్రక్రియను మొదలుపెట్టింది.ఈ ప్రాజెక్టును హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) పద్ధతిలో చేపట్టనున్నారు. దీని ప్రకారం, నిర్మాణ సమయంలో కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థకు ప్రభుత్వం 40 శాతం నిధులు చెల్లిస్తుంది. మిగిలిన 60 శాతం మొత్తాన్ని కాంట్రాక్టర్ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఆ మొత్తాన్ని ప్రభుత్వం వడ్డీతో పాటు 10-15 ఏళ్లలో తిరిగి చెల్లిస్తుంది. ప్రతి ప్యాకేజీని మూడేళ్లలో పూర్తి చేయాలని టెండర్లలో పేర్కొన్నారు.ఎన్టీఆర్, ఏలూరు, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 97 గ్రామాల మీదుగా ఈ ఓఆర్ఆర్ వెళ్తుంది. దీని నిర్మాణంలో భాగంగా కృష్ణా నదిపై రెండు భారీ వంతెనలు, మూడు సొరంగాలు, అనేక అండర్‌పాస్‌లు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే రాజధాని ప్రాంతంలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గి, ఓడరేవులు, విమానాశ్రయానికి అనుసంధానం మెరుగుపడి ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని భావిస్తున్నారు.

వరంగల్ ఎయిర్‌పోర్టు పనుల్లో ముందడుగు

మొదటి పేజీ తరువాయి

అంచనా కన్నా తక్కువకు బిడ్..
ప్రభుత్వానికి రూ.8 కోట్లు ఆదా
15 నెలల్లో పనులు పూర్తి చేయాలని లక్ష్యం

ఈ కాంట్రాక్టును సెప్టెంబర్ 29న ఖరారు చేశారు. ఈ పనుల కోసం ఏఏఐ రూ.21.39 కోట్లను అంచనా వ్యయంగా నిర్ణయించగా, సైదాక్స్ సంస్థ కేవలం రూ.13.28 కోట్లకే పనులు పూర్తి చేస్తామని బిడ్ దాఖలు చేసింది. ఇది అంచనా వ్యయం కంటే 37.89 శాతం తక్కువ. దీనివల్ల ప్రభుత్వానికి దాదాపు రూ.8.10 కోట్లు ఆదా కానుంది.కాంట్రాక్టు ప్రకారం, కొత్తగా సేకరించిన 283 ఎకరాల భూమి చుట్టూ ప్రీకాస్ట్ బౌండరీ వాల్ నిర్మించడంతో పాటు, పాత ప్రహరీ ఎత్తును కూడా పెంచనున్నారు. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) నిబంధనలకు అనుగుణంగా ఈ పనులు జరుగుతాయి. అక్టోబర్ 9న పనులు ప్రారంభించి, 15 నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒప్పందం ప్రకారం, అక్టోబర్ 14లోపు సైదాక్స్ కంపెనీ ప్రతినిధులు హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టులోని ఏఏఐ కార్యాలయంలో అధికారిక ఒప్పందంపై సంతకాలు చేయాలి.

చంద్రబాబు సమక్షంలో చారిత్రక డిక్లరేషన్!

మొదటి పేజీ తరువాయి

ఈ సదస్సులో భాగంగా క్యూ-శివ పేరుతో రూపొందించిన ఐదు మినీ టెస్టింగ్ క్వాంటం కంప్యూటర్లను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్, చండీగఢ్ యూనివర్సిటీ సహకారంతో రూపొందించిన ఈ కంప్యూటర్లతో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్‌ను కూడా ఆవిష్కరించారు. 'మేడ్ ఇన్ అమరావతి' బ్రాండ్‌ను సృష్టించేలా క్వాంటం కంప్యూటర్ల తయారీకి శ్రీకారం చుట్టడం రాష్ట్రంలో డీప్‌టెక్ ఉత్పత్తుల తయారీ సామర్థ్యానికి నిదర్శనమని సీఎం అన్నారు. ఈ కంప్యూటర్ల తయారీకి అవసరమైన కాంపోనెంట్లు మచిలీపట్నంలోనే లభిస్తున్నాయని క్యూబిట్ సంస్థ సీఈఓ వివరించడం గమనార్హం.దేశ నిర్మాణంలో ఐఐటీయన్ల పాత్ర కీలకమని, వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు వారి మేధస్సును వినియోగించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "ఇప్పటివరకు సిలికాన్ వ్యాలీ గురించి మాట్లాడుకున్నాం. ఇకపై ప్రపంచం అమరావతి క్వాంటం వ్యాలీ గురించి మాట్లాడుకుంటుంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అమరావతిలో ఐబీఎం-టీసీఎస్-ఎల్‌అండ్‌టీ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్లు ప్రారంభమవుతాయని వెల్లడించారు. భవిష్యత్తులో క్వాంటం కంప్యూటర్లను, వాటి పరికరాలను ఇక్కడే తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఏపీ ఎదగాలని ఆకాంక్షించారు

పాన్ ఐఐటీ డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలు

రెండు రోజుల మేధోమథనం అనంతరం విడుదల చేసిన ఉమ్మడి డిక్లరేషన్‌లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

పాన్ ఐఐటీ వరల్డ్ కౌన్సిల్: అమరావతి కేంద్రంగా ఇది ఏర్పాటవుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 5 లక్షల మంది ఐఐటీయన్లను అనుసంధానిస్తూ ఏపీ అభివృద్ధికి ఈ నెట్‌వర్క్ పనిచేస్తుంది.

టెక్నాలజీ బదిలీ: 23 ఐఐటీలు, 25 ఇన్నోవేషన్ హబ్‌ల నుంచి టెక్నాలజీలను గుర్తించి ఏపీలోని పరిశ్రమలు, స్టార్టప్‌లకు అందుబాటులోకి తెస్తారు.

నైపుణ్యాభివృద్ధి: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను పాన్ ఐఐటీ ఎకోసిస్టంతో అనుసంధానించి పరిశోధన, నైపుణ్యాలను బలోపేతం చేస్తారు.

స్టార్టప్‌లకు ప్రోత్సాహం: 2030 నాటికి రాష్ట్రంలో కనీసం 50 డీప్‌టెక్ స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయడమే లక్ష్యంగా 100 మంది ఐఐటీ మెంటర్ల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తారు.

పెట్టుబడుల ఆకర్షణ: క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక డీప్‌టెక్ పాలసీ ప్యాకేజీని అమలు చేస్తారు.

రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో వివిధ ఐఐటీల డైరెక్టర్లు, సీఈఓలు, వెంచర్ క్యాపిటలిస్టులు పాల్గొన్నారు. ఇంధనం, ఆరోగ్యం, వ్యవసాయం, నీటి భద్రత వంటి పలు కీలక రంగాలపై ప్యానెల్ చర్చలు జరిగాయి. ప్రతి ఏడాది పాన్ ఐఐటీ సమ్మిట్ నిర్వహించాలని సీఎం ఈ సందర్భంగా ప్రతిపాదించారు.


వదంతులు నమ్మొద్దు



మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై కూడా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణలో డిజైన్‌కు సంబంధించిన లోపాలుంటే, ఆ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. అయితే, నిర్మాణ ఏజెన్సీల పరిధిలోకి వచ్చే సమస్యలు ఏవైనా ఉంటే, వాటిని ఆయా సంస్థలే సొంత ఖర్చుతో సరిచేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు..



మొదటి పేజీ తరువాయి

తొలుత అక్టోబర్ 4న పర్యటనకు ఖరారైన షెడ్యూల్
షెడ్యూల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
నిరాశలో బీజేపీ శ్రేణులు

పర్యటనకు కారణాలు వెల్లడించని పార్టీ

ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు.హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు.ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ కొనుగోలు చేసి ప్రయాణించిన తెలంగాణ మంత్రులు



డే పాస్‌తో ఆర్టీసీ బస్సు, మెట్రో రైలులో ప్రయాణించిన మంత్రులు
బస్సులో బేగంపేట మెట్రోకు చేరుకున్న మంత్రులు
జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వరకు మెట్రో రైలులో ప్రయాణం

హైదరాబాద్, ((సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పలువురు మంత్రులతో కలిసి మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ రవాణాను మరింత సులభతరం చేయడం కోసం ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ తీసుకొచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో దీనిని ఆటోలు, క్యాబ్‌లకు అనుసంధానించే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు.శనివారం డే పాస్‌తో మంత్రులతో కలిసి ఆయన ఆర్టీసీ బస్సులో బేగంపేట మెట్రో స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా తనతో పాటు ప్రయాణించిన మంత్రులకు, భట్టి విక్రమార్క కాంబో పాస్ కొనుగోలు చేశారు.హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించడం, ప్రజా రవాణా వైపు ప్రయాణికులను ఆకర్షితులను చేయడం కోసం ఈ పాస్ తీసుకొచ్చినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ప్రస్తుతం వీటిని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలపై ఆర్థిక భారం పడకుండా చూస్తామని తెలిపారు. కాంబో పాస్‌పై ప్రయాణించిన మంత్రుల్లో వివేక్, అజారుద్దీన్ తదితరులు ఉన్నారు.




ఉద్యోగ నియామకాల్లో హైదరాబాద్ దేశంలోనే టాప్!

సెప్టెంబర్‌లో 9 శాతం వృద్ధి నమోదు చేసిన భాగ్యనగరం
ముంబై, ఢిల్లీ నగరాల్లో 6 శాతం మేర తగ్గిన నియామకాలు
ఏఐ, మెషీన్ లెర్నింగ్ రంగాల్లో అత్యధికంగా పెరిగిన అవకాశాలు
అనుభవజ్ఞులకే కంపెనీల మొగ్గు, ఫ్రెషర్లకు స్వల్ప వృద్ధి

హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)

దేశంలోని ఇతర ప్రధాన మెట్రో నగరాల కంటే 'వైట్ కాలర్' (ఆఫీస్) ఉద్యోగ నియామకాల్లో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. ప్రముఖ జాబ్ పోర్టల్ 'నౌకరి.కామ్' విడుదల చేసిన తాజా 'జాబ్‌స్పీక్' నివేదిక ప్రకారం, గత ఏడాదితో పోలిస్తే ఈ సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో నియామకాలు 9 శాతం వృద్ధిని సాధించాయి. ఇదే సమయంలో జాతీయస్థాయిలో నియామకాల వృద్ధి కేవలం 2 శాతంగానే నమోదవడం గమనార్హం.నౌకరి నివేదిక ప్రకారం, హైదరాబాద్ (9%) తర్వాత చెన్నై (6%), బెంగళూరు (4%), కోల్‌కతా (4%) నగరాలు సానుకూల వృద్ధిని కనబరిచాయి. పుణెలో నియామకాలు స్థిరంగా కొనసాగుతుండగా, దేశ ఆర్థిక రాజధాని ముంబైతో పాటు దేశ రాజధాని ప్రాంతం (ఢిల్లీ-ఎన్‌సీఆర్)లో ఉద్యోగ అవకాశాలు 6 శాతం మేర క్షీణించాయి.రంగాల వారీగా విశ్లేషిస్తే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) విభాగాల్లో అత్యధికంగా 20 శాతం వృద్ధి నమోదైంది. పండుగల సీజన్ డిమాండ్, ఎలక్ట్రిక్ వాహనాల విస్తరణ నేపథ్యంలో ఆటోమొబైల్ రంగం 11 శాతం వృద్ధిని సాధించింది. అయితే, ఐటీ-సాఫ్ట్‌వేర్ (-4%), ఫార్మా (-4%), హాస్పిటాలిటీ (-11%), విద్యా రంగం (-18%) వంటి కీలక రంగాల్లో నియామకాలు తగ్గుముఖం పట్టాయి.ప్రస్తుత నియామకాల్లో కంపెనీలు అనుభవజ్ఞులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. 13-16 ఏళ్ల మధ్య అనుభవం ఉన్నవారికి డిమాండ్ 7 శాతం పెరగ్గా, ఫ్రెషర్ల నియామకాలు కేవలం ఒక శాతం మాత్రమే వృద్ధి చెందాయి. ఇక 4-7 ఏళ్ల అనుభవం ఉన్న మిడ్-లెవల్ విభాగంలో నియమకాలు 2 శాతం మేర క్షీణించాయి.



'గౌరవెల్లి' సమస్యలను సత్వరం పరిష్కరించాలి

జలాశయం 98 శాతం పూర్తి
మిగతా పనులకు ప్రాధాన్యం
ఆర్థిక, న్యాయపరమైన ఇబ్బందులపై
ప్రభుత్వానికి నివేదించాలి
నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ఆదేశం
మంత్రి పొన్నంతో కలిసి గౌరవెల్లి ప్రాజెక్టు
పనులపై సమీక్ష


హైదరాబాద్, అక్టోబర్ 3 (సామాన్యుడి అస్త్రం)

గౌరవెల్లి ప్రాజెక్టును నిర్ణీత(గడువులోగా పూర్తి చేసి 1.06లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించేలా చర్యలు వేగవంతం చేయాలని అధికారులను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. ప్రాజెక్టుకు అడ్డుగా ఉన్న పర్యావరణ అనుమతులు, భూసేకరణ, పరిహారం, పునరావాస సమస్య లను త్వరగా కొలిక్కి తేవాలని సూచించారు.సచివాలయంలో శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి నీటిపారుదల, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జలాశయం పనులు ఇప్పటికే 98 శాతం పూర్తయ్యాయని, రైతుల పొలాలకు నీటిని తీసుకెళ్లే ప్రధాన కాలువలు, పంపిణీ కాలువలను సకాలంలో సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తగిన బడ్జెట్ కేటాయింపులు ఉన్నందున వాటిని సద్వినియోగం చేసుకొని పనుల్లో పురోగతి చూపాలని ఆదేశించారు.ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు రూ.1,343.59 కోట్లు ఖర్చు చేసినట్లు ఉత్తమ్



తెలిపారు. ఇందులో ధరల పెరుగుదలతో కలిపి నిర్మాణ పనులకు రూ.886.76 కోట్లు, భూసేకరణ, పునరావాసానికి రూ.456.83 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించా రు. ప్రాజెక్టును పూర్తి చేయడానికి మరో రూ.114.389 కోట్లు అవసరమని పేర్కొన్నారు. పనుల వారీగా స్పష్టమైన గడువులు నిర్ణయించాలని, ఆర్థిక, పరిపాలన, న్యాయపరమైన అడ్డంకులు ఉంటే వెంటనే ప్రభుత్వ దృష్టికి తేవా లని పేర్కొన్నారు. నిర్వాసితులకు పరిహారం త్వరగా చెల్లించాలని స్పష్టం చేశారు. జలాశయానికి సంబంధించిన రూ.1,457.979 కోట్ల సవరించిన అంచనాను తదుపరి మంత్రివర్గ సమావేశంలో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో పర్యావరణ అనుమతి లేకుండానే జలాశయ విస్తరణ చేపట్టడంతో ఈ అంశం జాతీయ హరిత ట్రైబ్యునల్‌కు (ఎన్జీటీ) చేరిందని మంత్రి తెలిపారు.పర్యావరణ అనుమతి పొందే వరకు తదుపరి నిర్మాణ పనులు చేపట్టరాదని తాజాగా ట్రిబ్యునల్ ఆదేశించిం దని, దీంతో నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు పేర్కొన్నారు. ఈనెల 8న జరగనున్న పర్యావరణ అనుమతి ప్రతిపాదన పరిశీలన సమావేశానికి అవసరమైన పత్రాలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు.అలాగే ఈనెల 16న ఎన్జీటీలో జరగనున్న విచారణకు ముందే న్యాయపరమైన పరిణామా లు, నవీకరించిన ప్రాజెక్టు రికార్డులను ట్రిబ్యునల్ ముందుంచాలని సూచించారు. ఇందుకోసం అడ్వకేట్ జనరల్, ప్రాజెక్టు తరఫు న్యాయవాదులతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు.
,850 ఎకరాల భూ సేకరణ..జలాశయానికి 3,870 ఎకరాలు అవసరం కాగా, ఇప్పటికే 3,850 ఎకరాలు సేకరించినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. మిగిలిన 20 ఎకరాలకు సంబంధించిన పరిహారాన్ని హైదరాబాద్‌లోని భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపన అథారిటీ వద్ద జమ చేసినట్లు పేర్కొన్నారు. కాలువల కోసం భూసేకరణకు జిల్లాల వారీగా గడువులు నిర్ణయించాలని సూచించారు.నిర్వాసిత కుటుంబాల వినతులను పరిశీలించి, సంబంధిత రికార్డులు, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పునరావాస ప్రయోజనాలను త్వరగా అందించాలని ఆదేశించారు. ఎడమ, కుడి ప్రధాన కాలువల్లో వినియోగానికి అనువుగా ఉన్న భాగాల నిర్వహణ, మరమ్మతులపైనా మంత్రి సమీక్షించారు. పంపిణీ కాలువల పనులకు అవసరమైన అంచనాలు, భూసేకరణ, టెండర్ల ప్రక్రియకు ఆచరణ సాధ్యమైన గడువులు నిర్ణయించాలని సూచించారు.

ఉన్నత విద్యకు ఉపాధి లక్ష్యం కావాలి



ప్రతి వర్సిటీలో స్టార్టప్‌లు, ఆవిష్కరణల కోసం ఇంక్యుబేషన్ సెంటర్: మంత్రి శ్రీధర్‌బాబు
జేఎన్టీయూహెచ్‌లో వేడుకగా 'రీచ్-2026'

హైదరాబాద్/ అక్టోబర్ 3 (సామాన్యుడి అస్త్రం)

తరగతి గదికి, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూర్తిగా తగ్గించాలని విద్యా సంస్థలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుపిలుపునిచ్చారు. విద్యా వ్యవస్థ యువతలో ఆలోచనా శక్తిని పెంపొందించడమే కాకుండా, వారిలో నైపుణ్యాలను అందించేలా వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు చూపేలా సిద్ధం చేయాలని ఆకాంక్షించారు. ఎగ్జిక్యూటివ్ చూడండితెలంగాణ ఉన్నత విద్యామండలి (టీజీసీహెచ్ఈ) ఆధ్వర్యంలో శనివారం కుకట్‌పల్లిలోని జేఎన్టీ యూహెచ్లో నిర్వహించిన 'రీచ్ 2026' (రిసెర్చ్, ఎడ్యుకేషన్ అండ్ అడ్వాన్స్‌మెంట్) సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తరగతి గది నుంచి భవిష్యత్ కెరీర్ వైపు, విద్య నుంచి నైపుణ్యాల వైపు, పరిశోధన నుంచి పారిశ్రామిక రంగానికి నిరంతర అనుసంధానం ఉండాలని మంత్రి పేర్కొన్నారు.మన విద్యా వ్యవస్థ కేవలం డిగ్రీ సర్టిఫికెట్లు అందించే విధానం నుంచి, విద్యార్థులకు ఆచరణాత్మక నైపుణ్యాలు అందించే దిశగా మారాలన్నారు. కోర్సు పూ ర్తయిన వెంటనే విద్యార్థి ఉద్యోగానికి అర్హత సాధించాలని, పట్టా చేతికి వచ్చే సమయానికే ఆ స్థాయి సన్నద్ధత ఉండాలని పునరు ద్ఘాటించారు. విద్యార్థులు, పరిశోధకులు తమ ఆలోచనలను స్టార్టప్‌లుగా, నూతన ఉ త్పత్తులుగా మలచడానికి వీలుగా ప్రతి విశ్వవిద్యాలయంలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటుచేయాలని మంత్రి సూచించారు. కరికులమ్ రూపకల్పన, ల్యాబ్‌ల నిర్వహణ, ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్టు, పరిశోధనల్లో పరిశ్రమలు భాగస్వామ్యమవ్వాలని విజ్ఞప్తి చేశారు'ఒక చేతిలో డిగ్రీ.. మరో చేతిలో నైపుణ్యం' ఉండటమే మన నూతన ప్రామాణికం కావాలన్నారు. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో 65 ప్రభుత్వ ఐటీఐలను రోబోటిక్స్, ఆటోమేషన్, ఇండస్ట్రీ 4.0 వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన కేంద్రాలుగా (ఏటీసీ) తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ద్వారా సరికొత్త విద్యా, నైపుణ్య వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. 'తెలంగాణ రైజింగ్ ఏ2047' లక్ష్యంతో ఉన్నత విద్యను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దడం, పరిశోధనల్లో ప్రతిభను పెంచడం, ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేయడంపై చర్చించారు. కార్యక్రమంలో సైయెం ట్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ బీవీఆర్. మోహన్‌రెడ్డి, టీజీసీహెచ్ఈ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, జేఎన్టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ టీ కిషన్ కుమార్‌రెడ్డి, ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, ప్రొఫెసర్ పురుషోత్తం, వివిధ వర్సిటీల వీసీలు, 60కి పైగా ఉన్న త విద్యాసంస్థల ప్రతినిధులుపారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయాలు, పరి శ్రమల మధ్య భాగస్వామ్యాలు, ఉమ్మడి పరిశోధనలు, స్టార్టప్‌లు, విద్యార్థులకు లభించే ఉపాధి అవకాశాల ప్రాతి పదికన మాత్రమే రీచ్ సదస్సు విజయాన్ని అంచనా వేయగలమని నిపుణులు అభిప్రాయపడ్డారు.

తెలంగాణలో సీనియర్ సిటిజన్లకు ఉచిత బస్ పాసులు!

పరిశీలిస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం
మహిళల మాదిరిగానే వృద్ధులకూ ఈ
సౌకర్యం కల్పించేందుకు కసరత్తు
త్వరలోనే అమలు చేస్తామన్న రవాణా
శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
అర్హతలు, విధివిధానాలు ఖరారుపై దృష్టి
ప్రస్తుతం రాష్ట్రంలో 48 లక్షల మంది
వృద్ధులు ఉన్నట్లు అంచనా

హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)


తెలంగాణలోని సీనియర్ సిటిజన్లకు రాష్ట్ర ప్రభుత్వం శు భవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వయోవృద్ధులకు కూడా వర్తింపజేసే ప్రతిపాదనను సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 1న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళలతో పాటు పురుషులతో సహా వయోవృద్ధులందరికీ ప్రయోజనం చేకూర్చేలా ఈ పథకాన్ని వీలైనంత త్వరగా అమలులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తే వృద్ధులు ఆసుపత్రులు, పుణ్యక్షేత్రాలు, బంధువుల ఇళ్లకు సులువుగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది.అయితే, ఈ పథకానికి సంబంధించిన అర్హతలు, వయో పరిమితి, ఆదాయ పరిమితులు వంటి అంశాలపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రభుత్వం త్వరలోనే దీనిపై పూర్తిస్థాయిలో చర్చించి మార్గదర్శకాలను ఖరారు చేయనుంది.



ప్రస్తుతం రాష్ట్రంలో వృద్ధుల జనాభా గణనీయంగా ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 32.69 లక్షలుగా ఉన్న వీరి సంఖ్య, ఇప్పుడు సుమారు 48 లక్షలకు (12.5 శాతం) చేరినట్లు అంచనా.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వృద్ధుల సంక్షేమానికి చేయూత పెన్షన్, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలను అమలు చేస్తోంది. అయితే, మహాలక్ష్మి పథకంతో ఇప్పటికే టీజీఎస్ఆర్టీసీపై ఆర్థిక భారం పడుతున్న నేపథ్యంలో, సీనియర్ సిటిజన్ల ఉచిత ప్రయాణంతో పడే అదనపు భారం, దానిని భర్తీ చేసే మార్గాలపై ప్రభుత్వం సమీక్ష జరుపుతోంది. అన్ని అంశాలను పరిశీలించి, విధివిధానాలు ఖరారు చేసిన తర్వాతే ఈ పథకం అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

ఒత్తిడిలో తెలంగాణ యువత.. దేశంలోనే రెండో స్థానం!

జుట్టు రాలడానికి మానసిక ఒత్తిడే ప్రధాన కారణమన్న నిపుణులు
నిద్రలేమి, జీవక్రియ సమస్యలతో తీవ్రమవుతున్న ఆరోగ్య సమస్యలు
పరిష్కారం కోసం వచ్చేసరికే 55 శాతం మందిలో అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో జుట్టు రాలే సమస్య
ప్రముఖ హెల్త్ ప్లాట్‌ఫామ్ 'ట్రయా' సర్వేలో వెల్లడి



హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ యువత తీవ్రమైన మానసిక ఒత్తిడి, ఆరోగ్య సమస్యలతో సతమతమవుతోంది. ముఖ్యంగా పురుషుల్లో జుట్టు రాలడానికి దారితీస్తున్న జీవనశైలి సంక్షోభంలో రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రముఖ హెల్త్ ప్లాట్‌ఫామ్ 'ట్రయా' దేశవ్యాప్తంగా 5.6 లక్షల మంది పురుషులపై జరిపిన భారీ అధ్యయనంలో ఈ విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి.

సర్వేలో ఏం తేలిందంటే?

దేశవ్యాప్తంగా 29 నుంచి 31 ఏళ్ల వయసున్న పురుషులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఈ సర్వే తేల్చింది. జాతీయ స్థాయిలో ఒత్తిడి సగటు 54.6 శాతం ఉండగా, తెలంగాణలో ఇది ఏకంగా 63.6 శాతంగా నమోదైంది. దీంతో దేశంలో అత్యధిక ఒత్తిడి ఎదుర్కొంటున్న రాష్ట్రాల్లో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. కేవలం ఒత్తిడే కాదు, నిద్రలేమి సమస్యలోనూ మన యువత ముందుంది. జాతీయ సగటు 29.5 శాతం అయితే, తెలంగాణలో 36.7 శాతం మంది యువకులు నిద్రలేమితో బాధపడుతూ దేశంలో రెండో స్థానంలో ఉన్నారు. ఇక జీవక్రియ మందగించడం (మెటబాలిజం) విషయంలో 50.7 శాతంతో మూడో స్థానంలో నిలిచింది. ఈ మూడు సమస్యలు ఒకదానితో ఒకటి ముడిపడి యువత ఆరోగ్యాన్ని, ముఖ్యంగా వారి కేశ సంపదను దెబ్బతీస్తున్నాయి.

జుట్టు రాలడం వెనుక అసలు కారణాలు

శరీరంలో అంతర్గతంగా పెరిగే ఒత్తిడి, పోషకాహార లోపం వంటి సమస్యల మొదటి ప్రభావం జుట్టుపైనే కనిపిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ అధ్యయనం ప్రకారం జుట్టు రాలడాన్ని నియంత్రించుకోవడానికి నిపుణులను సంప్రదించే సమయానికే, ఏకంగా 55.2 శాతం మంది యువకులు అడ్వాన్స్‌డ్ స్టేజ్‌కు చేరుకుంటున్నారు. మానసిక ఒత్తిడి, నిద్రలేమి, జీవక్రియ లోపం అనే ఈ మూడు సమస్యలు ఒకే వ్యక్తిలో ఏకకాలంలో తలెత్తి, శరీరాన్ని నిరంతర ఒత్తిడికి గురిచేసే అంతర్గత వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని సర్వే పేర్కొంది.

ఈ సమస్యలు జుట్టును ఎలా దెబ్బతీస్తాయి?

మానసిక ఒత్తిడి: నిరంతర ఒత్తిడి వల్ల శరీరంలో 'కార్టిసాల్' అనే హార్మోన్ పెరుగుతుంది. ఇది జుట్టు పెరుగుదల చక్రాన్ని అడ్డుకుని, కుదుళ్లను బలహీనపరిచి జుట్టు రాలిపోయేలా చేస్తుంది.

నిద్రలేమి: నిద్రలోనే మన శరీరంలోని కణాలు తమను తాము మరమ్మతు చేసుకుంటాయి (సెల్యులార్ రిపేర్). దీర్ఘకాలిక నిద్రలేమి వల్ల ఈ ప్రక్రియకు ఆటంకం కలిగి, జుట్టు ఆరోగ్యం క్షీణిస్తుంది.

జీవక్రియ లోపం: శరీరం సరైన సామర్థ్యంతో పనిచేయనప్పుడు, అది తన శక్తిని, పోషకాలను గుండె, కిడ్నీల వంటి ముఖ్యమైన అవయవాలకే పంపిస్తుంది. ఈ క్రమంలో జుట్టు పెరుగుదలకు ప్రాధాన్యం తగ్గిపోతుంది.

నిపుణులు ఏమంటున్నారు?

ఈ సందర్భంగా ట్రయా హెల్త్ సహ వ్యవస్థాపకురాలు సలోని ఆనంద్ మాట్లాడుతూ "పురుషులు ఊహించిన దానికంటే చాలా చిన్న వయసులోనే జుట్టు రాలడం సమస్యను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో జుట్టు రాలడానికి కేవలం తలపై చర్మ సమస్యలు కారణం కాదు. శరీరంలో అంతర్గతంగా జరుగుతున్న ఈ పరిణామాలే అసలు మూలం" అని వివరించారు.

ఈ సర్వే ప్రకారం, ఒత్తిడి, నిద్రలేమి, జీవక్రియ లోపం.. ఈ మూడు సమస్యల్లోనూ తమిళనాడు దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు ఆ తర్వాతి స్థానాల్లో ఉండటం, ఈ సమస్య దక్షిణాది యువతను ఎంతగా పట్టిపీడిస్తోందో స్పష్టం చేస్తోంది. జుట్టు రాలడం అనేది కేవలం సౌందర్య సమస్యగా కాకుండా, తీవ్రమైన ఆరోగ్య సంక్షోభానికి సంకేతంగా చూడాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

క్యూ-శివ, అమరావతి డిక్లరేషన్.. పాన్ ఐఐటీ సమ్మిట్ లో కీలక ఘట్టాలను ఆవిష్కరించిన చంద్రబాబు

విజయవాడలో పాన్ ఐఐటీ సమ్మిట్-2026
హాజరైన సీఎం చంద్రబాబు
డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు
అమరావతిలో శాశ్వత పాన్ ఐఐటీ కౌన్సిల్ ఏర్పాటుకు నిర్ణయం
వచ్చే ఫిబ్రవరి నుంచి అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్
క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతామన్న సీఎం చంద్రబాబు



హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు సాంకేతిక ప్రగతికి, పెట్టుబడులకు కేంద్రంగా నిలవనుందనడానికి విజయవాడలో జరిగిన పాన్ ఐఐటీ అమరావతి సమ్మిట్ 2026 నిలువుటద్దం పట్టింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు కీలక ఘట్టాలు ఆవిష్కృతమయ్యాయి. డీప్‌టెక్నాలజీ అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తూ చారిత్రక 'అమరావతి డిక్లరేషన్' విడుదల చేయడంతో పాటు, "మేకిన్ అమరావతి" సంకల్పంతో రూపొందించిన ఐదు "క్యూ-శివ" క్వాంటం కంప్యూటర్లను సీఎం ఆవిష్కరించారు.క్యూబిట్ ఫోర్స్ సంస్థ, చండీఘడ్ యూనివర్సిటీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్యూ-శివ కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం ల్యాబ్‌లుగా పనిచేస్తాయి. వీటితో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్ 'సృష్టి'ని కూడా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యూబిట్ సంస్థ సీఈఓ వెంకటసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఈ కంప్యూటర్ల తయారీకి అవసరమైన కొన్ని కీలక కాంపోనెంట్లు ప్రపంచంలో ఒకటి రెండు చోట్ల మాత్రమే లభిస్తాయని, అలాంటివి మన మచిలీపట్నంలో దొరకడం విశేషమని తెలిపారు. తమ ప్రయత్నానికి సీఎం చంద్రబాబు అందించిన సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. అనంతరం క్యూబిట్ ప్రతినిధుల కృషిని అభినందించిన ముఖ్యమంత్రి, వారితో కలిసి సెల్ఫీ దిగి ఉత్సాహపరిచారు.

అమరావతి డిక్లరేషన్.. డీప్‌టెక్‌కు ఊతం

ఈ సదస్సులో ఏపీ ప్రభుత్వం, పాన్ ఐఐటీ అలుమ్ని ప్రతినిధులు సంతకాలు చేసిన 'అమరావతి డిక్లరేషన్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని ప్రకారం, అమరావతిలో ఏపీ ప్రభుత్వం-పాన్ ఐఐటీ అలుమ్ని ఇండియా ఆధ్వర్యంలో ఒక శాశ్వత కౌన్సిల్ ఏర్పాటు కానుంది. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు రూ.500 కోట్ల పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.ఈ కౌన్సిల్ ద్వారా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, స్టార్టప్‌లను సమన్వయం చేస్తారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 10 ఇండస్ట్రీ చైర్స్ ఏర్పాటు చేయడం, 100 మంది గ్లోబల్ ఐఐటీ మెంటర్లతో స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేయడం, 23 ఐఐటీల నుంచి టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ వంటివి ఈ డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలు. క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి, 2030 నాటికి కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు.

క్వాంటం వ్యాలీగా అమరావతి: సీఎం చంద్రబాబు

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "గతంలో ఐటీని ప్రోత్సహిస్తే ప్రపంచవ్యాప్తంగా మన తెలుగువారు నిపుణులుగా ఎదిగారు. ఇప్పుడిక సిలికాన్ వ్యాలీ గురించి కాదు, అమరావతిలోని క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం చర్చించుకుంటుంది" అని ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను విజన్ 2020 తీసుకువచ్చినప్పుడు కొందరు '420' అంటూ హేళన చేశారని, కానీ దాని ద్వారానే విద్యుత్, రహదారుల వంటి రంగాల్లో సంస్కరణలు వచ్చాయని గుర్తుచేశారు.ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదగడాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. జాతి నిర్మాణంలో భాగమైన ఐఐటీయన్లు వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఐబీఎం-టీసీఎస్, ఎల్ అండ్ టీ సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అమరావతి నుంచే ప్రారంభమవుతాయని చంద్రబాబు ప్రకటించారు. భవిష్యత్తులో కేవలం వినియోగించుకోవడమే కాకుండా, క్వాంటం కంప్యూటర్లను తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఆంధ్రప్రదేశ్ చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

'చుట్టమల్లే' పాట డీప్ ఫేక్ పై చిరంజీవి ఆగ్రహం..

మహిళల మార్ఫింగ్ వీడియోలపై తీవ్రంగా స్పందించిన చిరంజీవి
ఇది క్రూరమైన, సిగ్గుచేటైన చర్యగా అభివర్ణన
సైబర్ క్రైమ్ పోలీసులతో కలిసి పనిచేసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు డిమాండ్
ఏఐ దుర్వినియోగాన్ని అరికట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి
వీడియోలను షేర్ చేయవద్దు, రిపోర్ట్ చేయాలని ప్రజలకు పిలుపు

హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)

కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించి 'చుట్టమల్లే' పాట అసభ్యకరమైన, మార్ఫింగ్ వీడియోలను సృష్టించడంపై టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి తీవ్రంగా స్పందించారు. ఇలాంటి చర్యలు క్రూరమైనవి, సిగ్గుచేటైనవి, ఏమాత్రం ఆమోదయోగ్యం కానివని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇది కేవలం ఒక వ్యక్తికి లేదా ఒక సినిమాకు సంబంధించిన సమస్య కాదని, యావత్ సమాజం దీనిపై పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈ విషయంలో తాను చొరవ తీసుకుని, సినీ పరిశ్రమ తరఫున గట్టి చర్యలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు.ఈ అంశంపై చిరంజీవి సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. "ఈ రోజు ఇది మరొకరికి జరిగింది. రేపు మీకు, నాకు లేదా మనకు తెలిసిన ఎవరికైనా జరగవచ్చు. మనకు వ్యక్తిగతంగా జరగలేదు కదా అని మౌనంగా ఉండలేం.

మీరు చెప్పేది మేం వింటాం.. ఇదిగో సత్యాగ్రహ వెబ్ సైట్: సీఎం రేవంత్ రెడ్డి



'సత్యాగ్రహ' పేరుతో కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించిన రాహుల్ గాంధీ
దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలు, ఉద్యమాలను ఏకతాటిపైకి తేవడమే లక్ష్యం
ప్రత్యేక వెబ్‌సైట్‌లో తమ ఉద్యమ వివరాలు నమోదు చేసేందుకు అవకాశం
ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఒక కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా వివిధ సమస్యలపై పోరాడుతున్న వారి గొంతుకలను ఏకం చేసే లక్ష్యంతో 'సత్యాగ్రహ' పేరుతో ఒక కొత్త వేదికను ఆయన ప్రారంభించారు. ఈ విషయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు.దేశవ్యాప్తంగా సత్యం అణచివేతకు గురవుతోందని, దీనికి వ్యతిరేకంగా ప్రజలు తమ గళం విప్పుతున్నారని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. భూమి, మహిళల హక్కులు, దళిత, ఓబీసీల హక్కులు, విద్య, పరీక్షల్లో అక్రమాలు వంటి అనేక అంశాలపై ప్రజలు నిరసనలు తెలుపుతున్నారని తెలిపింది. ఇలా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ ఉద్యమాలను ఒకే మ్యాప్‌పైకి తీసుకువచ్చి, వాటిని సమన్వయం చేసేందుకు 'సత్యాగ్రహ' కార్యక్రమాన్ని రూపొందించినట్లు రాహుల్ గాంధీ తెలిపారుఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. తమ సమస్యలు, పోరాటాలకు సంబంధించిన వివరాలను ఈ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి, నిర్దేశిత ఫారం నింపడం ద్వారా ఉద్యమకారులు తమ గళాన్ని జాతీయ స్థాయిలో వినిపించేందుకు అవకాశం కల్పించారు.ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళుతూ సీఎం రేవంత్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. "మీ గళాన్ని మేం వింటాం, మీతో కనెక్ట్ అవుతాం. సత్యం, న్యాయం కోసం మీరు చేస్తున్న పోరాటానికి మా పూర్తి మద్దతు ఉంటుంది. 'సత్యాగ్రహ' వెబ్‌సైట్‌ను సందర్శించి మీ ఉద్యమ వివరాలను నమోదు చేయండి" అని ఆయన పిలుపునిచ్చారు.

చంద్రబాబుకు ఇప్పుడు యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది: పాన్ ఐఐటీ సమ్మిట్ లో మంత్రి లోకేశ్

విజయవాడలో 'పాన్ ఐఐటీ సమ్మిట్ - 2026
హాజరైన మంత్రి నారా లోకేశ్
ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చడమే లక్ష్యమని ఉద్ఘాటన
చంద్రబాబు అనుభవానికి యువ ఎమ్మెల్యేల బృందం తోడైందని వెల్లడి



అమరావతి,(సామాన్యుడి అస్త్రం)

ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం అనే బలమైన సాఫ్ట్‌వేర్‌కు, యువతతో నిండిన చురుకైన హార్డ్‌వేర్ టీమ్ ఇప్పుడు అండగా నిలిచిందని, ఈ అరుదైన కలయికతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయవాడలో జరిగిన 'పాన్ ఐఐటీ సమ్మిట్ - 2026'లో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి తమ వంతు సహకారం అందిస్తామని, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఏపీని మార్చడమే తమ ఉమ్మడి లక్ష్యమని అన్నారు."ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం 4.0 ఆపరేటింగ్ సిస్టమ్‌తో మరింత ఉత్సాహంగా పనిచేస్తున్నారు. ఆయనకు ఇప్పుడు ఒక యంగ్ హార్డ్‌వేర్ టీమ్ అండగా ఉంది. మా శాసనసభ్యుల్లో 50 శాతం మంది మొదటిసారి గెలిచినవారే. 25 మంది మంత్రులలో 17 మంది తొలిసారి మంత్రులయ్యారు. అనుభవజ్ఞమైన సాఫ్ట్‌వేర్‌కు, ఈ యువ, డైనమిక్ హార్డ్‌వేర్ కలయికే నేటి ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెడుతోంది. ఏ రంగంలోనైనా ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా ఉండాలన్నదే మా స్పష్టమైన విజన్" అని లోకేశ్ వివరించారు. 5 లక్షల మందికి పైగా ఐఐటీ గ్రాడ్యుయేట్లను కలిపే పాన్ ఐఐటీ సదస్సు ఏపీలో జరగడం ఆనందంగా ఉందన్నారు.

అభివృద్ధికి '3ఓ' మంత్రం

అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి భారత్‌కు ఒక దశాబ్దం చాలని, ఆ స్వర్ణ దశాబ్దం మనదే కావాలని ఆకాంక్షించిన లోకేశ్, దీనికి తమ ప్రభుత్వం '3ఓ' మంత్రాన్ని అనుసరిస్తోందని తెలిపారు. "మొదటిది స్పీడ్ (వేగం), రెండోది సర్వీస్ (సేవ), మూడోది స్టెబిలిటీ (స్థిరత్వం). ప్రజలు మాకు ఇచ్చింది ఐదేళ్ల సమయం. ఈ సమయంలోనే ఫలితాలు చూపించాలి. కేవలం ఎంఓయూలు కుదుర్చుకుని వాటిని మర్చిపోయే రకం మాది కాదు. ప్రాజెక్టులకు వాస్తవ రూపమిచ్చి ఉద్యోగాలు సృష్టించాలన్న తపన మాది. పరిశ్రమదారులను మేము 'జాతి నిర్మాణకర్తలు'గా భావిస్తున్నాం. వారితో కలిసి పనిచేస్తూ, ప్రపంచ స్థాయి పాలన అందించడమే మా సేవా దృక్పథం. ఇక మూడోది స్థిరత్వం. మా పాలసీలు కాలపరీక్షను, రాజకీయ మార్పులను తట్టుకుని నిలబడేలా ఉంటాయి" అని ఆయన అన్నారు. ఇందుకు ఉదాహరణగా, గత కేసులన్నింటినీ ూ× ద్వారా విశ్లేషించి, న్యాయపరమైన చిక్కులు రాకుండా 16,000 ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను చేపట్టామని గుర్తుచేశారు.

అమలుపైనే దృష్టి.. ఇవే మా నిదర్శనాలు

కేవలం కాగితాలపై హామీలు కాకుండా, వాస్తవంగా అమలవుతున్న ప్రాజెక్టుల గురించి లోకేశ్ సవివరంగా మాట్లాడారు. "ఏపీలో నమో అంటే నాయుడు జీ, మోదీజీ జోడీ. డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉండటం వల్లే పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏపీని గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా మార్చాలన్న సీఎం సంకల్పంతో రిలయెన్స్ భాగస్వామ్యంతో మదనపల్లెలో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు శంకుస్థాపన చేశాం. ఇది లక్ష కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తుంది" అని తెలిపారు."ఇతర రాష్ట్రాల్లో దశాబ్దాలుగా నిలిచిపోయిన ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టుకు కేవలం 17 నెలల్లోనే పునాది వేశాం. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని 13 నెలల్లోనే అనుమతులు సాధించి పనులు ప్రారంభించాం. దేశంలో ఎవరూ ఊహించని ధరకు స్పేస్ టెక్ స్టార్టప్ స్కైరూట్‌కు 300 ఎకరాలు కేటాయించాం. మారిటైమ్ డ్రోన్ల తయారుచేసే సాగర్ డిఫెన్స్ సంస్థకు ఫిషింగ్ హార్బర్‌లో స్థలం ఇవ్వగా, 18 నెలల్లో ఆ సంస్థ విలువ రూ.3,000 కోట్ల నుంచి రూ.23,000 కోట్లకు పెరిగింది. ఇదే మా ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం" అని లోకేశ్ పేర్కొన్నారు.

23 క్లస్టర్ల ఏర్పాటు.. అమరావతిపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో హార్టికల్చర్ నుంచి క్వాంటం కంప్యూటింగ్ వరకు 23 పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామని, రెన్యువబుల్ ఎనర్జీలో ఏడాదిలోనే 4.8 గిగావాట్ల సామర్థ్యాన్ని జోడించామని లోకేశ్ వెల్లడించారు. అమరావతి నిర్మాణంపై మాట్లాడుతూ, "మీరు అమరావతికి వస్తే, నిర్మాణంలో ఉన్న ఒక ఆధునిక నగరం కనిపిస్తుంది. ప్రపంచ ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ నార్మన్ ఫోస్టర్ డిజైన్లతో అసెంబ్లీ, సచివాలయం వంటివి నిర్మిస్తున్నాం. ఇక్కడ 5,000 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మించబోతున్నాం. హైదరాబాద్ అభివృద్ధిలో శంషాబాద్ విమానాశ్రయం పోషించిన పాత్రను ఇది పోషిస్తుంది" అని అన్నారు.

ఐఐటీయన్లకు రెండు విజ్ఞప్తులు

ఈ సందర్భంగా పాన్ ఐఐటీ కమ్యూనిటీకి లోకేశ్ రెండు విజ్ఞప్తులు చేశారు. "మొదటిది, ప్రపంచాన్ని జయించిన మీ గ్రాడ్యుయేట్ల పరిజ్ఞానాన్ని, మార్గదర్శకత్వాన్ని మా 23 క్లస్టర్ల అభివృద్ధికి అందించాలి. రెండోది, 'జుగాడ్' మోడల్ నుంచి 'వ్యవస్థీకృత వేగం' వైపు ఏపీ ప్రయాణించడానికి, ఏఐ సాయంతో మెరుగైన పాలన అందించడానికి మీరంతా సహకరించాలి. ఇతర దేశాల మోడళ్ల గురించి మాట్లాడటం కాదు, భారత్ ఏం చేయగలదో ప్రపంచానికి చూపించాలి. అందుకు ఆంధ్రప్రదేశ్‌ను ఒక ఆదర్శంగా నిలపాలనుకుంటున్నాం" అని లోకేశ్ తన ప్రసంగాన్ని ముగించారు.

ఆసియా క్రీడల్లో టీమిండియాకు స్వర్ణం..



ఆసియా గేమ్స్ 2026 క్రికెట్‌లో భారత పురుషుల జట్టుకు స్వర్ణం
ఫైనల్‌లో పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం
వరుసగా రెండోసారి ఆసియా గేమ్స్ స్వర్ణాన్ని నిలబెట్టుకున్న టీమిండియా
భారత జట్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ అభినందనలు
మహిళల జట్టు కూడా స్వర్ణం గెలవడంతో భారత్‌కు క్రికెట్‌లో డబుల్ గోల్డ్

అమరావతి,(సామాన్యుడి అస్త్రం)

ఆసియా క్రీడలు 2026లో భారత పురుషుల క్రికెట్ జట్టు స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో విజయం సాధించి, మరోసారి ఆసియా ఛాంపియన్‌గా నిలిచింది. ఈ విజయంతో భారత్ వరుసగా రెండోసారి ఆసియా గేమ్స్ స్వర్ణాన్ని గెలుచుకుని తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలోని యువ జట్టు అద్భుతమైన నైపుణ్యం, సంయమనంతో కూడిన ప్రదర్శన కనబరిచి దేశానికి గర్వకారణంగా నిలిచింది.ఈ చారిత్రక విజయంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ భారత జట్టుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. "ఆసియా గేమ్స్ 2026లో పాకిస్థాన్‌ను ఓడించి స్వర్ణం గెలిచిన భారత పురుషుల క్రికెట్ జట్టుకు హృదయపూర్వక అభినందనలు. వరుసగా రెండోసారి స్వర్ణ పతకం గెలిచి టైటిల్‌ను నిలబెట్టుకోవడం అద్భుతం. ఆటగాళ్లు కనబరిచిన నైపుణ్యం యావత్ దేశం గర్వించేలా చేసింది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో పాటు జట్టు సభ్యులందరినీ ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారుమంత్రి నారా లోకేశ్ సైతం భారత జట్టును అభినందించారు. "ఉత్కంఠభరిత ఫైనల్‌లో పాకిస్థాన్‌ను ఓడించి మన ఆసియా గేమ్స్ స్వర్ణాన్ని విజయవంతంగా నిలబెట్టుకున్న టీమిండియాకు అభినందనలు. అభిషేక్ శర్మ, తిలక్ వర్మల ప్రత్యేక ప్రదర్శనలు ఈ ఫైనల్‌ను చిరస్మరణీయం చేశాయి," అని ఆయన అన్నారు. ఇప్పటికే మహిళల జట్టు కూడా స్వర్ణం గెలుచుకోవడంతో, ఆసియా క్రీడల్లో క్రికెట్‌లో భారత్ "డబుల్ గోల్డ్" సాధించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ రెండు విజయాలతో ఆసియా గేమ్స్ క్రీడా యవనికపై భారత కీర్తి పతాక రెపరెపలాడింది.

సుప్రీం తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్లిన ఏపీ ప్రభుత్వం
బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న నారాయణ
గత ప్రభుత్వం వల్లే అమరావతి అభివృద్ధి ఆగిపోయిందని విమర్శ



అమరావతి,(సామాన్యుడి అస్త్రం)

స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పందించారు. అమరావతిలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే 123 మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారురాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని మంత్రి నారాయణ వివరించారు. ఇందుకోసం సుమారు రూ.2,000 కోట్లు కేటాయించామని, ఇందులో ఒక్క రాజమండ్రి అభివృద్ధి పనులకే రూ.1,000 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉన్నప్పటికీ, పుష్కరాల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గతంలో జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన రూ.5,350 కోట్ల నిధులు వినియోగించుకోకపోవడంతో నిలిచిపోయిన ప్రాజెక్టులను కేంద్రం సహకారంతో పునరుద్ధరిస్తామని తెలిపారు.అమరావతి అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ, ప్రపంచంలోని ఐదు ఉత్తమ రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. గత ప్రభుత్వం అమరావతి అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 2028 చివరి నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 2027లో 12 రోజుల పాటు జరగనున్న గోదావరి పుష్కరాలకు లక్షలాదిగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో రోడ్లు, ఘాట్లు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల పనులను వివిధ శాఖలు సమన్వయంతో చేపడుతున్నాయి

పేదల కోసం మరో 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్‌తో కలిసి శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు
దేశంలోనే తొలిసారిగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ఇళ్ల ప్రాజెక్టుకు భూమిపూజ
గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలో రేపు ఈ కార్యక్రమం
గత 28 నెలల్లో ప్రభుత్వం 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది

అమరావతి,(సామాన్యుడి అస్త్రం)

రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేస్తోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ గ్రామీ-+) 2.0 పథకం కింద కేంద్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన మూడు లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి రేపు (అక్టోబరు 4) భూమిపూజ చేయనున్నారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం గ్రామంలో ఈ కార్యక్రమం జరగనుంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 28 నెలల కాలంలో ఇప్పటికే 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది. గతేడాది నవంబరులో 3 లక్షలు, ఈ ఏడాది మార్చిలో 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించిన ప్రభుత్వం, ఇప్పుడు మరో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం ఇటీవలే ఈ 3 లక్షల ఇళ్లను కేటాయించింది. దీంతో ఏమాత్రం జాప్యం చేయకుండా నిర్మాణ పనులను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే సమయంలో, వచ్చే ఏడాది మార్చి నాటికి మరో 4.20 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

దేశంలోనే తొలిసారిగా 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ

ఈ కార్యక్రమంతో పాటు, గృహ నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతూ దేశంలోనే తొలిసారిగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పైలట్ ప్రాజెక్టుకు కూడా చంద్రబాబు, శివరాజ్ సింగ్ చౌహాన్ శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, సీఎస్ఐఆర్-సీబీఆర్ఐ (రూర్కీ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి.పైలట్ ప్రాజెక్టు కింద తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం, ఓబులనాయుడు పాలెం గ్రామాల్లో రూ.14 కోట్ల అంచనా వ్యయంతో 177 ఇళ్లను నిర్మించనున్నారు.

ప్రియురాలిపై దాడి.. భవనం పైనుంచి దూకి ప్రియుడి ఆత్మహత్య


విజయవాడలో ఇద్దరి ప్రాణాలు తీసిన ప్రేమ వ్యవహారం
యువతిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ప్రియుడు
అనంతరం సమీప భవనంపై నుంచి దూకి ఆత్మహత్య
ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువతి మృతి
పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడమే కారణం?

అమరావతి,(సామాన్యుడి అస్త్రం)

నగరంలో ఓ ప్రేమ వ్యవహారం తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రేమించిన యువతి దక్కదేమోనన్న ఆవేదనతో ఓ యువకుడు ఆమెపై దాడి చేసి ప్రాణాలు తీశాడు. అనంతరం తాను కూడా భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ దారుణ ఘటన శనివారం ఉదయం న్యూ రాజరాజేశ్వరీపేటలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో పడవల మహాలక్ష్మి (19), మంకు చిన్నారావు (22) మృతి చెందారు.పోలీసుల కథనం ప్రకారం, శ్రీకాకుళం జిల్లాకు చెందిన చిన్నారావు పెయింటింగ్, ఫ్లవర్ డెకరేషన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం విజయవాడలోని తన అన్నయ్య ఇంటికి తరచూ వస్తుండేవాడు. ఈ క్రమంలో న్యూ రాజరాజేశ్వరీపేటలోని జేఎన్ఎన్యూఆర్ఎం నివాస సముదాయంలో నాయనమ్మతో కలిసి ఉంటున్న మహాలక్ష్మితో అతడికి రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. ఓ దుస్తుల దుకాణంలో పనిచేసే మహాలక్ష్మితో పరిచయం కాస్తా ప్రేమగా మారింది.ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నా, ఇరు కుటుంబాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇటీవల పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా జరిగింది. ఇకపై మహాలక్ష్మి జోలికి వెళ్లనని ఆ సమయంలో చిన్నారావు అంగీకరించినట్లు తెలుస్తోంది.

మహారాష్ట్రలో వరుస భూకంపాలు.. రెండు గంటల్లో రెండుసార్లు కంపించిన భూమి

మహారాష్ట్ర హింగోలీ జిల్లాలో వరుస భూకంపాలు
రెండు గంటల వ్యవధిలో రెండుసార్లు కంపించిన భూమి
రిక్టర్ స్కేలుపై 4.5గా నమోదైన రెండో భూకంప తీవ్రత
భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసిన ప్రజలు
ఆస్తి, ప్రాణ నష్టం లేదని స్పష్టం చేసిన అధికారులు



అక్టోబర్3(సామాన్యుడి అస్త్రం)

మహారాష్ట్రలోని హింగోలీ జిల్లాలో శనివారం ఉదయం వరుస భూప్రకంపనలు ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేశాయి. రెండు గంటల వ్యవధిలో రెండుసార్లు భూమి కంపించడంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.జిల్లా విపత్తు నిర్వహణ విభాగం వివరాల ప్రకారం, శనివారం ఉదయం 7.46 గంటలకు ఔంధా నాగనాథ్ తహసీల్‌లోని గధాలా గ్రామంలో భూమికి 7 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.3గా నమోదైంది. ఈ ఘటన జరిగిన రెండు గంటల తర్వాత, అదే ప్రాంతంలో 4.5 తీవ్రతతో మరో శక్తిమంతమైన భూకంపం సంభవించింది.రెండోసారి భూమి కంపించడానికి ముందు కొన్ని నిమిషాల పాటు భారీ శబ్దాలు వినిపించాయని పింపల్దారీ, సమీప గ్రామాల ప్రజలు తెలిపారు. ఈ ప్రాంతంలో గత ఆరేళ్లుగా తరచూ భూప్రకంపనలు సంభవిస్తున్నాయి. ఈ ఏడాది జులై 9, 11 తేదీల్లో 4.6, 3.5 తీవ్రతతో భూకంపాలు రావడం, కొన్ని ఇళ్లకు పగుళ్లు ఏర్పడటంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందవద్దని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం సూచించింది.

జమ్ము ఆసుపత్రిలో 'బురఖా' వివాదం.. విద్యార్థుల నిరసన



జమ్ములోని దోడా మెడికల్ కాలేజీలో బురఖా వివాదం
లేబర్ రూమ్‌లోకి రానీయలేదని నర్సింగ్ విద్యార్థుల ఆందోళన
ఇది పారపాటున జరిగిందన్న ఆసుపత్రి యాజమాన్యం

న్యూఢిల్లీ,(సామాన్యుడి అస్త్రం)

జమ్మూకశ్మీర్ లోని దోడా ప్రభుత్వ వైద్య కళాశాలలో బురఖా వివాదం చెలరేగింది. గైనకాలజీ విభాగంలోని లేబర్ రూమ్‌లోకి బురఖా ధరించిన తమను అనుమతించలేదని ఆరోపిస్తూ నర్సింగ్ ఇంటర్న్‌లు, విద్యార్థినులు ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై ఆసుపత్రి యాజమాన్యం స్పందించింది. విచారణకు ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది.వివరాల్లోకి వెళితే, సెప్టెంబర్ 30న కొందరు నర్సింగ్ విద్యార్థినులు విధులకు హాజరయ్యారు. అయితే, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ మధు చిబ్, బురఖా ధరించిన కారణంగా తమను లేబర్ రూమ్‌లోకి రాకుండా అడ్డుకున్నారని విద్యార్థులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తమ మత విశ్వాసాలను కించపరిచేలా ఆమె మాట్లాడారని, దీనిపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ వారు విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు.ఈ వివాదంపై ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇర్ఫాన్ తసద్దుఖ్ స్పందించారు. ఇది కేవలం పొరపాటున జరిగిన ఘటన అని తెలిపారు. లేబర్ రూమ్ వంటి సున్నితమైన ప్రదేశాల్లో ఇన్ఫెక్షన్ సోకకుండా ఉండేందుకు ప్రత్యేక నిబంధనలు ఉంటాయని, వదులుగా ఉండే దుస్తులపై ఆసుపత్రి గౌను ధరించాలని మాత్రమే ప్రొఫెసర్ సూచించారని ఆయన వివరించారు.విద్యార్థుల ఫిర్యాదుతో యాజమాన్యం ఏర్పాటు చేసిన కమిటీ రెండు రోజుల్లో నివేదిక సమర్పించనుంది. మరోవైపు, ఈ వివాదం రాజకీయంగానూ చర్చనీయాంశమైంది. హిజాబ్ ధరించడం వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన విషయమని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ వ్యాఖ్యానించింది. యాజమాన్యం జోక్యంతో విద్యార్థులు తమ నిరసనను విరమించుకున్నారు. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

రెండేళ్లలో ఇలాంటి రైలు బోగీలు కనిపించవు!


2028 నాటికి రైళ్ల నుంచి ఐసీఎఫ్ కోచ్‌లకు వీడ్కోలు
ప్రయాణికుల భద్రతను పెంచడమే ప్రధాన లక్ష్యం
పాత కోచ్‌ల స్థానంలో అధునాతన ఎల్‌హెచ్‌బీ, అమృత్ భారత్ రైళ్లు
ఇప్పటికే 1600కు పైగా రైళ్లలో కోచ్‌ల మార్పు పూర్తి
భవిష్యత్తులో పుష్-పుల్ టెక్నాలజీతో కూడిన రైళ్లపై రైల్వే శాఖ దృష్టి



న్యూఢిల్లీ,(సామాన్యుడి అస్త్రం)

ప్రయాణికుల భద్రతను పెంచే దిశగా భారతీయ రైల్వే ఓ కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా నడుస్తున్న మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో పాత ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఎజఖీ) కోచ్‌లను పూర్తిగా తొలగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2027-28 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసి, వాటి స్థానంలో అధునాతన, సురక్షితమైన లింక్ హాఫ్‌మన్ బుష్ (ూఒదీ) కోచ్‌లను అందుబాటులోకి తీసుకురావాలని ప్రణాళికలు రచిస్తోంది.రైల్వే శాఖ నివేదికల ప్రకారం, దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 2,000 రైళ్లలో ఇప్పటికే 1,600కు పైగా రైళ్లలో ఐసీఎఫ్ కోచ్‌లను ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో భర్తీ చేశారు. మిగిలి ఉన్న 340 నుంచి 350 రైళ్లలో కూడా ఈ మార్పును వేగవంతం చేయనున్నారు. రాబోయే రెండేళ్లలో, అంటే 2027, 2028 ఆర్థిక సంవత్సరాల్లో ఏటా 170-180 రైళ్ల చొప్పున పాత కోచ్‌లను మార్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.ఐసీఎఫ్ కోచ్‌లను తొలగించడానికి ప్రధాన కారణం భద్రతాపరమైన లోపాలే. ఈ పాత కోచ్‌లు ప్రమాదాలకు గురైనప్పుడు ఒకదానికొకటి గుద్దుకుని, ఒకదానిపై ఒకటి ఎక్కే (టెలిస్కోపింగ్) ప్రమాదం ఎక్కువగా ఉంది. దీనివల్ల ప్రాణనష్టం అధికంగా సంభవిస్తుంది. ఈ సమస్యను అధిగమించేందుకే రైల్వే శాఖ 2018లోనే ఐసీఎఫ్ కోచ్‌ల తయారీని నిలిపివేసింది ఐసీఎఫ్ కోచ్‌ల మార్పిడి పూర్తయ్యాక, రైల్వే శాఖ కొత్త రైళ్ల తయారీలో మరో ముందడుగు వేయనుంది. భవిష్యత్తులో మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లను 'అమృత్ భారత్' ప్లాట్‌ఫామ్ ఆధారంగా, పుష్-పుల్ టెక్నాలజీతో నిర్మించనున్నారు. ఈ రైళ్లకు రెండు వైపులా ఇంజిన్లు ఉండటం వల్ల, రైలు ప్రారంభమయ్యేటప్పుడు కుదుపులు లేకుండా సాఫీగా కదులుతుంది. అలాగే, అధిక వేగంతో ప్రయాణిస్తున్నప్పుడు కూడా మెరుగైన భద్రతను అందించేలా సెమీ-రిజిడ్ కప్లర్లను వినియోగిస్తారు.అయితే, కొన్ని ఐసీఎఫ్ కోచ్‌లను ప్రత్యేక రైళ్లు, డిమాండ్‌పై నడిపే రైళ్లు, రైల్వే శాఖ అంతర్గత అవసరాల కోసం వినియోగించనున్నారు. తుప్పు పట్టిన కోచ్‌లను త్వరగా స్క్రాప్‌కు పంపేందుకు మార్గదర్శకాలు రూపొందిస్తున్నారు. ఇకపై తయారు చేసే ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను కూడా పుష్-పుల్ టెక్నాలజీకి అనువుగా నిర్మించాలని ఉత్పత్తి యూనిట్లకు రైల్వే బోర్డు ఆదేశాలు జారీ చేసింది.

సరిహద్దు చొరబాటుపై భగ్గుమన్న భారత్.. పాక్ దౌత్యవేత్తకు సమన్లు



సరిహద్దు చొరబాట్లపై పాకిస్థాన్ దౌత్యవేత్తకు భారత్ సమన్లు
పంజాబ్ సరిహద్దుల్లో ఇద్దరు చొరబాటుదారులను కాల్చిచంపిన బీఎస్ఎఫ్
పాక్ ఆరోపణలను ఖండించిన భారత్.. నార్కోటిక్స్ ముఠాల పనేనని ఆరోపణ
చనిపోయింది అమాయక పౌరులంటూ భారత దౌత్యవేత్తకు పాక్ నిరసన
ఘటనపై దర్యాప్తు జరపాలని పరస్పరం డిమాండ్ చేసుకుంటున్న ఇరు దేశాలు

న్యూఢిల్లీ(సామాన్యుడి అస్త్రం)

సరిహద్దుల గుండా అక్రమ చొరబాట్లను పాకిస్థాన్ ప్రోత్సహిస్తోందంటూ భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశంపై గట్టి నిరసన తెలిపేందుకు, నిన్న ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ తాత్కాలిక దౌత్య అధికారికి సమన్లు జారీ చేసింది. పంజాబ్ సరిహద్దుల్లో జరిగిన ఘటనపై పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలను పూర్తిగా ఖండిస్తున్నట్లు స్పష్టం చేసిందివిదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 2వ తేదీన పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సెక్టార్ వద్ద అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఈ ఘటన చోటుచేసుకుంది. పాకిస్థాన్ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు భారత భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించారు. వెనక్కి వెళ్లిపోవాలని సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ వారు పట్టించుకోలేదు. పైగా సరిహద్దు కంచె వైపు దూసుకెళ్తుండటంతో వారిని భద్రతకు ముప్పుగా భావించిన బీఎస్ఎఫ్ బలగాలు కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు మరణించారు.ఈ ఘటనపై పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవి, దురుద్దేశంతో కూడినవని భారత్ కొట్టిపారేసింది. పాకిస్థాన్ నుంచి పనిచేస్తున్న సాయుధ నార్కోటిక్స్ సిండికేట్ల కార్యకలాపాల్లో భాగంగానే ఈ చొరబాట్లు జరుగుతున్నాయని ఆరోపించింది. ఇలాంటి కార్యకలాపాలపై, అలాగే దీని వెనుక పాకిస్థాన్ సరిహద్దు దళాల ప్రమేయం ఉందన్న ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఇస్లామాబాద్‌ను భారత్ డిమాండ్ చేసింది. సరిదిద్దుబాటు చర్యలు తీసుకోవాలని, అంతర్జాతీయ సరిహద్దు పవిత్రతను గౌరవించాలని హితవు పలికింది.మరోవైపు, ఈ ఘటనపై పాకిస్థాన్ కూడా తీవ్రంగానే స్పందించింది. ఇస్లామాబాద్‌లోని భారత అగ్రశ్రేణి దౌత్యవేత్తను పిలిపించి నిరసన తెలియజేసింది. బీఎస్ఎఫ్ కాల్పుల్లో మరణించిన ఇద్దరూ నిరాయుధులైన అమాయక పౌరులని ఆరోపించింది. ఈ ఘటనపై తక్షణమే దర్యాప్తు జరపాలని డిమాండ్ చేసింది. ఈ విధంగా ఒకే ఘటనపై ఇరు దేశాలు భిన్న వాదనలు వినిపిస్తూ, దౌత్యపరమైన నిరసనలు తెలుపుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి



దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలేనన్న ఖర్గే
మోదీ, అమిత్ షాతో పాటు అందరూ అక్రమంగా పదవుల్లో ఉన్నారని వ్యాఖ్య
ఈవీఎంల దుర్వినియోగం జరిగిందని ఆరోపణ

న్యూఢిల్లీ,(సామాన్యుడి అస్త్రం)

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తూ, తీవ్రమైన డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ అక్రమమని ఆరోపిస్తూ, లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలోని కలబుర్గిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే నడుస్తోందని ఆరోపించారు.ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో జరుగుతున్న అవకతవకల కారణంగానే ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు. "ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ మంత్రి అని, దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆ పదవుల్లో ఉన్నట్టేనని అన్నారు. వాటన్నింటినీ రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి" అని చెప్పారు.ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించినట్లు ఖర్గే తెలిపారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని, అందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఓటర్ల జాబితా నుంచి కొన్ని వర్గాల ప్రజల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై యువతలో చైతన్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

అల్లంతో హై బీపీకి చెక్

ఆహారంలో వినియోగించే అల్లం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. హైబీపీని నియంత్రించడంలో ఇది చక్కగా సాయపడుతుందన్నారు. అలాగే అనేక అనారోగ్య సమస్యలను కూడా తగ్గిస్తుంది.

అల్లం వాడడం వల్ల..

అల్లంలో అనేక జీవక్రియశీల సమ్మేళనాలు(ఉంటాయి. ఇవి హైబీపీని సాధారణ స్థితికి తీసుకురావడానికి దోహదపడతాయి. అల్లంలో జింజెరోల్, షాగావోల్ తదితర సమ్మేళనాలు ఉంటాయి. అదే విధంగా వీటిలో యాంటీఆక్సిడెంట్, యాంటీఇన్ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి హైబీపీని నియంత్రించడంలో సహాయపడతాయి. అల్లం తినడం వల్ల రక్తనాళాలు సాధారణ స్థితికి వస్తాయి. తద్వారా శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడటం సహా హైబీపీ సమస్యను తగ్గిస్తుంది.

ఇతర వ్యాధులకు చెక్..



అల్లంలో వాపు నిరోధక గుణాలు ఉంటాయి. ఇది శరీరంలోని ఏ భాగంలోనైనా వాపును తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. అల్లం తీసుకోవడం వల్ల శరీరంలోని హానికరమైన విష పదార్థాలతోపాటు వ్యర్థాలనూ తొలగిస్తాయి. కీళ్లు, కండరాలలో నొప్పి ఉంటే.. అల్లం తీసుకోవడం వల్ల ఇట్టే తగ్గిపోతాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే జలుబు, దగ్గును తగ్గించడంలో అల్లం ప్రభావవంతంగా పని చేస్తుంది. అల్లంను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంచుకోవడం సహా వైరల్, సీజనల్ ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు.

రోజూ పాలను తాగితే ఆస్టియోపోరోసిస్ వస్తుందా..
నిపుణులు ఏమంటున్నారు..?

పాలు తాగితే ఎముకలు బలంగా ఉంటాయని తరతరాలుగా చెబుతూ వస్తున్నారు. అయితే ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో ఎక్కువగా పాలు తాగడం వల్ల ఎముకలు బలహీనపడి ఆస్టియోపోరోసిస్ వచ్చే ప్రమాదం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆర్థోపెడిక్ నిపుణులు ఈ అపోహలను ఖండిస్తూ, మితంగా పాలు తీసుకోవడం వల్ల ఎముకలకు ఎలాంటి హాని ఉండదని స్పష్టం చేస్తున్నారు. అయితే ఆరోగ్యకరమైన ఎముకల కోసం పాలు మాత్రమే కాకుండా సమతుల ఆహారం, వ్యాయామం, ఆరోగ్యకర జీవనశైలి కూడా అంతే ముఖ్యమని సూచిస్తున్నారు. పాలు లేదా మాంసాహారం ఎక్కువగా తీసుకుంటే శరీరంలో ఆమ్లత్వం పెరిగి, దానిని సమతుల్యం చేయడానికి ఎముకల నుంచి కాల్షియం బయటకు వస్తుందని ఒకప్పుడు యాసిడ్-యాష్ సిద్ధాంతం పేరుతో ప్రచారం జరిగింది. కానీ ఇటీవలి శాస్త్రీయ పరిశోధనలు ఈ సిద్ధాంతానికి ఎలాంటి బలమైన ఆధారాలు లేవని తేల్చాయి. సరిపడా కాల్షియంతోపాటు ప్రోటీన్ కూడా తీసుకుంటే ఎముకలు మరింత బలపడతాయని, ముఖ్యంగా వృద్ధాప్యంలో ఎముకలు విరిగే ప్రమాదం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.

శాస్త్రీయ ఆధారాలు లేవు..

మితంగా లేదా కొంచెం ఎక్కువ పరిమాణంలో పాలు తాగడం వల్ల ఆస్టియోపోరోసిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుందనే వాదనకు ఇప్పటివరకు శాస్త్రీయ ఆధారాలు లేవని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. అందుబాటులో ఉన్న పరిశోధనల ప్రకారం పాలు, పాల ఉత్పత్తులను మితంగా తీసుకోవడం ఎముకల ఖనిజ సాంద్రతపై ప్రతికూల ప్రభావం చూపదని, కొన్ని సందర్భాల్లో సానుకూల ప్రభావం కూడా ఉంటుందని వెల్లడైంది. ఆస్టియోపోరోసిస్ అంటే ఎముకల ఖనిజ సాంద్రత తగ్గి అవి బలహీనపడే వ్యాధి. ఇది ఒక్క ఆహారం వల్ల మాత్రమే రాదు. వయస్సు పెరగడం, మహిళల్లో మెనోపాజ్ కారణంగా హార్మోన్ల మార్పులు, విటమిన్ డి లోపం, శారీరక శ్రమ లేకపోవడం, ధూమపానం, అధిక మద్యపానం, పోషకాహార లోపం వంటి అనేక కారణాలు కలిసి ఈ సమస్యకు దారితీస్తాయని నిపుణులు వివరిస్తున్నారు.

అనేక పోషకాలకు పాలు మూలం..

పాలు కాల్షియం, ప్రోటీన్, ఫాస్పరస్, విటమిన్ డి (ఫోర్టిఫై చేసిన పాలలో) వంటి ఎముకల నిర్మాణానికి అవసరమైన కీలక పోషకాలకు మంచి మూలం. చిన్నతనం నుంచి యుక్తవయస్సు, పెద్దవయస్సు వరకు తగిన మోతాదులో కాల్షియం తీసుకోవడం వల్ల ఎముకలు గరిష్ఠ బలాన్ని సంతరించుకునే అవకాశం ఉంటుంది. అందువల్ల పాలను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. అయితే పాలను అధికంగా తాగడం కూడా మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాలు మాత్రమే ఎక్కువగా తీసుకుని ఇతర ఆహారాలను తగ్గిస్తే శరీరానికి అవసరమైన ఇతర పోషకాలు అందవు. దీని వల్ల పోషకాహార అసమతుల్యత ఏర్పడే ప్రమాదం ఉంటుంది. కొందరిలో అజీర్ణం, అధిక కేలరీల వినియోగం వంటి సమస్యలు కూడా కనిపిస్తాయి. కాబట్టి పాలను సమతుల ఆహారంలో భాగంగా మాత్రమే తీసుకోవాలి.

పాలను తాగలేకపోతే..

లాక్టోజ్ అసహనం (లాక్టోజ్ ఇంటోలరెన్స్) ఉన్నవారు పాలను జీర్ణించుకోలేరు. అలాంటి వారు కాల్షియం కోసం ఫోర్టిఫై చేసిన మొక్కల ఆధారిత పాలు, రాగి, టోఫూ, ఆకుకూరలు వంటి ప్రత్యామ్నాయ ఆహారాలను తీసుకోవచ్చు. వీటి ద్వారా కూడా శరీరానికి అవసరమైన కాల్షియం లభిస్తుంది. ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పాలు ఒక్కటే సరిపోవని, సమతుల ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సూర్యరశ్మి ద్వారా విటమిన్ డి పొందడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడం వంటి ఆరోగ్యకర అలవాట్లు పాటించడం అత్యంత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. మితంగా పాలు తాగడం వల్ల ఆస్టియోపోరోసిస్ వచ్చే ప్రమాదం పెరగదని, సరైన జీవనశైలిలో భాగంగా పాలు ఎముకల ఆరోగ్యానికి మేలు చేస్తాయని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

గ్రీక్ యోగర్ట్.. పెరుగు ఒకటేనా?
ఏది ఆరోగ్యానికి మంచిది?


గ్రీక్ యోగర్ట్, పెరుగు ఒకటి కావు
గ్రీక్ యోగర్ట్‌లో ప్రోటీన్ ఎక్కువ
పెరుగులో కాల్షియం కొద్దిగా అధికం
రెండింట్లోనూ ప్రోబయోటిక్స్ ఉంటాయి
బరువు నియంత్రణకు గ్రీక్ యోగర్ట్‌కు ప్రాధాన్యం

గ్రీక్ యోగర్ట్, పెరుగు చూడటానికి దాదాపు ఒకేలా కనిపిస్తాయి. కానీ రెండూ ఒకటి కావు. తయారీ విధానం, పోషక విలువలు, రుచి, ప్రయోజనాల్లో స్పష్టమైన తేడాలు ఉంటాయి. మీ ఆరోగ్య లక్ష్యం ఏమిటనేదాన్ని బట్టి వీటిలో ఏది ఎంచుకోవాలో నిర్ణయించుకోవచ్చుసాధారణ పెరుగును... గోరువెచ్చని పాలలో మజ్జిగ లేదా పెరుగు కలిపి పులియబెట్టి తయారు చేస్తారు. గ్రీక్ యోగర్ట్‌ను మాత్రం సాధారణ పెరుగును పలుమార్లు వడకట్టి అందులోని నీటిని తొలగిస్తారు. అందుకే అది మరింత చిక్కగా, క్రీమీగా ఉంటుంది. రుచిలో కూడా తేడా కనిపిస్తుంది. పెరుగు తేలికగా, స్వల్ప పులుపుతో ఉంటుంది. గ్రీక్ యోగర్ట్‌లో పులుపు కాస్త ఎక్కువగా ఉంటుంది. చిక్కటి పదార్థం కావడంతో క్రీమీ అనుభూతి కూడా ఎక్కువగా ఉంటుంది.పోషక విలువల విషయానికి వస్తే గ్రీక్ యోగర్ట్‌లో ప్రోటీన్ శాతం ఎక్కువగా



ఉంటుంది. వెన్న తొలగించే ప్రక్రియలో ప్రోటీన్ సాంద్రత పెరుగుతుంది. అందుకే వ్యాయామం చేసే వారు, కండరాల బలం పెంచుకోవాలనుకునే వారు దీన్ని ఎక్కువగా తీసుకుంటారు. మరోవైపు పెరుగులో కాల్షియం, కార్బోహైడ్రేట్లు కొద్దిగా ఎక్కువగా ఉండొచ్చు. అయితే ఇది ఉపయోగించే పాల రకాన్ని బట్టి మారుతుంది.రెండింట్లోనూ ప్రేగుల ఆరోగ్యానికి ఉపయోగపడే మంచి బ్యాక్టీరియా ఉంటుంది. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడంలో సాయపడతాయి. ఇంట్లో పరిశుభ్రంగా తయారు చేసిన పెరుగు కూడా మంచి ప్రోబయోటిక్ ఆహారమే. బరువు తగ్గాలనుకునేవారికి గ్రీక్ యోగర్ట్ మెరుగైన ఎంపికగా భావిస్తారు. ఇందులో ప్రోటీన్ ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంటుంది. అయితే తక్కువ కొవ్వు ఉన్న పాలతో చేసిన పెరుగు కూడా బరువు నియంత్రణలో భాగం కావచ్చు.వాడకంలో మాత్రం పెరుగుదే పైచేయి. రైతా, మజ్జిగ, కూరలు, మారినేషన్, స్వీట్లలో పెరుగును విస్తృతంగా ఉపయోగిస్తారు. గ్రీక్ యోగర్ట్‌ను స్మూతీలు, బ్రేక్‌ఫాస్ట్ బౌల్స్, సలాడ్ డ్రెస్సింగ్‌లు, డిప్స్, డెజర్ట్‌లలో ఎక్కువగా వాడుతారు. కొన్ని వంటల్లో క్రీమ్, మయోనైజ్‌కు ప్రత్యామ్నాయంగానూ ఉపయోగిస్తున్నారు.మొత్తానికి ఎక్కువ ప్రోటీన్ కావాలంటే గ్రీక్ యోగర్ట్ మంచి ఎంపిక. రోజువారీ ఆహారంలో సులభంగా కలిపి తీసుకోవాలంటే పెరుగు చక్కని ప్రత్యామ్నాయం. రెండూ పోషక విలువలు ఉన్న ఆరోగ్యకరమైన ఆహారాలే.

ఏడడుగుల దూరంలో ఆనందాల మజిలి



సంతోషం ఎక్కడో బయట దొరికేది కాదు. ఎంత ఖరీదు పెట్టినా సరే కూరగాయల్లా దానిని బజారులో కొనుక్కోలేం. మన ఆలోచనల్లో, అలవాట్లలో, జీవనశైలిలోనే అది దాగి ఉంటుంది. దాన్ని ఎలా సంపాదించుకోవాలో చెప్పే జపాన్ దేశానికి చెందిన ఏడు సూత్రాలు ఈమధ్య బాగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ముఖ్యంగా ఇంటి పనులతో సతమతమవుతూ జీవితం అంటే ఇంతేనా? అని ఇటీవలి కాలంలో నైరాశ్యానికి గురవుతున్న గృహిణులతో పాటు ఇంటా బయటా ఒత్తిడికి లోనవుతున్న ఉద్యోగినులకు ఇవి మంచి పాఠాలుగా ఉపయోగపడతాయి. ఇందులో ఇకిగై మనం చేసే పనులకు ప్రేరణ ఇస్తే, కైజెన్ ముందుకు నడిపిస్తుంది. హరా హాచిబు, పొమొడోరో ఆరోగ్యాన్ని కాపాడుతాయి. కింట్సుగి, వాబి-సాబి మనసుకు బలాన్నిస్తాయి. సెయిరి-సెయిటోన్ క్రమబద్ధతను నేర్పుతాయి. ఈ ఏడు జపాన్ సూత్రాలను రోజువారీ జీవితంలో కొద్దికొద్దిగా ఆచరిస్తే ప్రతి మహిళా.. తన జీవితాన్ని మరింత ప్రశాంతంగా, అర్థవంతంగా, ఆనందమయంగా మార్చుకోవచ్చు.

ఇకిగై -- ప్రతి ఉదయానికీ ఒక అర్థం

ఉదయం లేవగానే 'ఈ రోజు నేను ఎందుకు ఉత్సాహంగా ఉండాలి?' అనే ప్రశ్నకు సమాధానమే ఇకిగై. చాలామంది మహిళలు తమ జీవితాన్ని కుటుంబ బాధ్యతలకే పరిమితం చేసుకుంటారు. అయితే తమకు ఇష్టమైన రచన, సంగీతం, తోటపని, సామాజిక సేవ, వృత్తిపరమైన నైపుణ్యాలు పెంచుకోవడం వంటి ఏదో ఒక అంశాన్ని జీవిత లక్ష్యంగా ఎంచుకుంటే ప్రతి రోజూ కొత్త ఉత్సాహంతో మొదలవుతుంది. ఉద్యోగం చేస్తున్న మహిళకు తన పనిలోని సామాజిక ప్రయోజనం ఇకిగై కావచ్చు. గృహిణికి కుటుంబాన్ని సంతోషంగా ఉంచడం లేదా తన ప్రతిభను అభివృద్ధి చేసుకోవడం ఇకిగై కావచ్చు. జీవితానికి ఒక అర్థం కనిపించినప్పుడు ఒత్తిడి తగ్గి ఆత్మసంతృప్తి పెరుగుతుంది.

కైజెన్ -- రోజుకో చిన్న అడుగు

కొత్త సంవత్సరం వస్తే పెద్ద పెద్ద లక్ష్యాలు పెట్టుకోవడం సులభం. కానీ, వాటిని కొనసాగించడం కష్టం. కైజెన్ మాత్రం రోజుకు ఒక చిన్న మార్పు చాలని చెబుతుంది. బరువు తగ్గాలంటే మొదటి రోజే గంట వ్యాయామం చేయాల్సిన అవసరం లేదు. రోజుకు పది నిమిషాల నడకతో మొదలుపెట్టవచ్చు. పుస్తకాలు చదవాలంటే రోజుకు రెండు పేజీలు చదివితే సరిపోతుంది. ఇలా చిన్నచిన్నగా మెరుగవడం వల్ల కొద్ది నెలల్లో పెద్ద ఫలితాలు వస్తాయి. మహిళలు తమ ఆరోగ్యం, ఆర్థిక నిర్వహణ, వృత్తి నైపుణ్యాల్లో ఈ సూత్రాన్ని అనుసరిస్తే ఆశ్చర్యకరమైన మార్పులను చూడగలరు.

హరా హాచి బు -- ఆహార నియంత్రణ

ఇంట్లో అందరికీ వడ్డించి చివరగా తినే మహిళలు చాలామంది. కొన్నిసార్లు ఆకలి కంటే ఎక్కువ తినడం కూడా జరుగుతుంది. మిగిలిపోయిన ఆహారాన్ని పారేయకుండా, పొట్టలో వేసేవాళ్లూ చాలామందే. హరా హాచి బు సూత్రం ప్రకారం కడుపు పూర్తిగా నిండే వరకు కాకుండా సుమారు 80 శాతం నిండగానే భోజనం ఆపాలి. భోజనం నెమ్మదిగా నములుతూ తింటే త్వరగా తృప్తి కలుగుతుంది. ఇది బరువు నియంత్రణకు, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధులను దూరం పెట్టడానికి ఉపయోగపడుతుంది. 'ఇంకో ముద్ద తినాలా?' అనిపించినప్పుడు ఆగడం కూడా ఒక ఆరోగ్య అలవాటే.

పొమొడోరో -- సమయానికి విలువ

మహిళల రోజు ఒకేసారి ఎన్నో పనులతో నిండిపోతుంది. పిల్లల సంరక్షణ, వంట, ఉద్యోగం, ఇంటి పనులు.. ఇలా అన్నిటినీ నిర్వహించాల్సి వస్తుంది. పొమొడోరో పద్ధతి ప్రకారం ఒకేసారి ఒక పనిపైనే పూర్తిగా దృష్టి పెట్టాలి. ఉదాహరణకు 25 నిమిషాలు ఫోన్ పక్కన పెట్టి ఒక పనిని పూర్తి చేయాలి. ఆ తర్వాత ఐదు నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలి. మళ్లీ 25 నిమిషాలు పని చేసుకోవాలి. ఇలా చేస్తే పనులపై ఏకాగ్రత పెరుగుతుంది. రోజు చివరికి అలసట కూడా తక్కువగా ఉంటుంది.

కింట్సుగి -- గాయాలను బలంగా మార్చుకో

జీవితంలో ప్రతి మహిళ ఏదో ఒక సమయంలో నిరాశ, వైఫల్యం, అనారోగ్యం లేదా వ్యక్తిగత నష్టాన్ని ఎదుర్కొంటుంది. కింట్సుగి తత్వం ప్రకారం పగిలిన పాత్ర విలువ కోల్పోదు; దాన్ని బంగారంతో అతికిస్తే మరింత ప్రత్యేకంగా మారుతుంది. అలాగే మన జీవితంలోని గాయాలు, కష్టాలు మనల్ని బలహీనులను చేయవు. వాటి నుంచి నేర్చుకున్న పాఠాలే మన వ్యక్తిత్వాన్ని మరింత అందంగా తీర్చిదిద్దుతాయి. విఫలమైన అనుభవాలను దాచిపెట్టకుండా వాటిని ఎదుగుదలకు మెట్లుగా మార్చుకోవాలని ఈ సూత్రం చెబుతుంది. కింట్సుగి పాత్ర పగుళ్లను దాచడానికి ప్రయత్నించదు. ఆ పగుళ్లే ఆ పాత్ర చరిత్రకు, అది ఎదుర్కొన్న కష్టాలకు గుర్తులు. బంగారం పూయడం ద్వారా ఆ గాయాలనే అత్యంత అందమైన భాగాలుగా మారుస్తుంది. భవిష్యత్తులో సాంకేతికత ఎంత పెరిగినా, మనుషుల్లో ఒత్తిడి, మానసిక ఆందోళనలు, బంధాలలో బీటలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి హైటెక్ యుగంలో కింట్సుగి ఒక గొప్ప 'హీలింగ్ టూల్' (వైద్యం)లా పనిచేస్తుంది. భవిష్యత్తులో రోబోలు, పర్‌ఫెక్ట్ అల్గారిథమ్స్ మనల్ని శాసిస్తున్నప్పుడు, మనలోని 'లోపాలే' మనల్ని మనుషులుగా నిలబెడతాయి. వైఫల్యాలను చూసి కుంగిపోకుండా, వాటిని బంగారు అనుభవాలుగా మార్చుకుని ముందుకు సాగడమే కింట్సుగి నేర్పే పరమార్థం. కాబట్టి మహిళలూ... పగుళ్లు పడిన జీవితాన్ని పారేయకండి, కింట్సుగితో దాన్ని ఒక అద్భుతమైన కళాఖండంగా మార్చుకోండి.

సెయిరి -- సెయిటోన్..ఇల్లు శుభ్రం -- మనసు ప్రశాంతం

అల్మరాల్లో, వంటగదిలో, మొబైల్‌లో, మన ఆలోచనల్లో కూడా అనవసరమైన విషయాలు పేరుకుపోతుంటాయి. సెయిరి అంటే అవసరం లేని వాటిని తొలగించడం. సెయిటోన్ అంటే మిగిలిన వాటిని క్రమబద్ధంగా అమర్చుకోవడం. నెలకు ఒకసారి ఇంట్లో ఉపయోగించని వస్తువులను తొలగించడం, పత్రాలను సక్రమంగా భద్రపరచడం, మొబైల్‌లో అవసరం లేని ఫైళ్లను డిలీట్ చేయడం వంటి చిన్న చర్యలు జీవితాన్ని తేలికగా మారుస్తాయి. క్రమబద్ధత పెరిగిన కొద్దీ మానసిక ప్రశాంతత కూడా పెరుగుతుంది.

బన్నీ-అట్లీ సినిమా పుకార్లకు చెక్ పెట్టిన ఐశ్వర్య లక్ష్మి

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రాబోతున్న పాన్-ఇండియా చిత్రం 'రాకా'పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో సినిమా క్యాస్టింగ్‌కు సంబంధించి వస్తున్న ఊహాగానాలకు నటి ఐశ్వర్య లక్ష్మి తెరదించారు. ఈ చిత్రంలో తాను నటిస్తున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆమె స్పష్టం చేశారు.గత కొన్ని రోజులుగా 'రాకా' చిత్రంలో ఐశ్వర్య లక్ష్మి ఒక కీలక పాత్రలో, ముఖ్యంగా నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతున్నారంటూ ప్రచారం జోరుగా సాగింది. ఈ పుకార్లపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందించిన ఆమె, "నేను ఆ సినిమాలో భాగం కాదు. దయచేసి ఎవరైనా నన్ను ఆ సినిమాలో తీసుకోండి" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఆమె వివరణతో ఈ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పడినట్లయింది.అల్లు అర్జున్-అట్లీ కాంబోలో వస్తున్న తొలి సినిమా కావడంతో 'రాకా'పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఇందులో దీపికా పదుకొణె నటిస్తున్నట్లు ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. వీరితో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్, రష్మిక మందన్న వంటి తారల పేర్లు కూడా పరిశ్రమ వర్గాల్లో వినిపిస్తున్నాయి.ప్రస్తుతం ఐశ్వర్య లక్ష్మి, అర్జున్ దాస్‌తో కలిసి నటించిన రొమాంటిక్ కామెడీ సిరీస్ 'లవ్'లో నటిస్తున్నారు. 'పాన్నియిన్ సెల్వన్' వంటి చిత్రాలతో ఈమె చాలా గుర్తింపు పొందారు.



ఎస్ఐఆర్ కుట్రపూరితం..



ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా వివాదాస్పదమైన ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉద్దేశపూర్వకంగానే కొందరి ఓట్లను తొలగించేందుకు ఈ ప్రక్రియ చేపట్టారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు.ఎస్ఐఆర్ ప్రక్రియ కింద దేశవ్యాప్తంగా సుమారు 13.4 కోట్ల మంది ఓటర్ల పేర్లను ముసాయిదా జాబితాల నుంచి తొలగించడం తీవ్ర వివాదానికి దారితీసింది. తొలగించడమే వారి ముఖ్య ఉద్దేశమని ఆరోపించారు.

ఇంత బ్యూటిఫుల్ రెస్పాన్స్ ఊహించలేదు!



హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా నటించి చిత్రం 'తెల్లకాగితం'(రమేశ్ బండ్రెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, మాటలు నందు సవిరిగాన అందించారు. అరుణాచల క్రియేషన్స్ బ్యానర్‌పై కృష్ణ కొమ్మాలపాటి నిర్మించారు. అక్టోబర్ 2న విడుదలైన ఈ సినిమా ఇప్పుడు థియేటర్లలో సందడి చేస్తోంది. ఈ నేపథ్యంలో మూవీటీమ్ సక్సెస్ మీట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో హర్ష్ రోషన్ మాట్లాడుతూ.. "ఒక మంచి సినిమా తీస్తే ఇంత ప్రేమని ఇస్తారని మళ్లీ నిరూపించారు.ప్రీమియర్స్ నుంచి చాలా మంచి స్పందన వచ్చింది. అన్ని ఫ్యూర్ సోల్స్ కలిసి ఒక సినిమా చేస్తే ఎలా ఉంటుందో అదే 'తెల్లకాగితం'. ఎంతో ఇష్టపడి చేశాం ఈ సినిమా" అన్నారు. హీరోయిన్ నక్షత్ర మాట్లాడుతూ.. "తెల్లకాగితం సినిమాకు ఇంత బ్యూటిఫుల్ రెస్పాన్స్ ఊహించలేదు. నన్ను అందరూ నక్షత్ర కన్నా 'ఆశ' అనే పిలుస్తున్నారు. ఫ్యామిలీస్ అందరూ థియేటర్లకు వెళ్తున్నందుకు చాలా హ్యాపీగా ఉంది" అని చెప్పింది.

అది బ్యాడ్ టచ్ కాదు.. ప్యూర్ లవ్'



పుట్టినరోజు సందర్భంగా అభిమానులతో ఫొటోలు (దిగుతున్న నటి రచిత రామ్ ()కు ఎదురైన ఓ ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో () చర్చనీయాంశంగా మారింది. అభిమానులతో ఫొటోలు దిగుతున్న సమయంలో అభిమానులు ఆమె బుగ్గలు గిల్లడంతో ఈ వీడియోకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై పలువురు నెటిజన్లు భిన్నంగా స్పందించారు. అయితే దీనిపై తాజాగా రచిత రామ్ స్పందిస్తూ క్లారిటీ (ఇచ్చారు. ఆ అభిమానులు తనను చెడుగా తాకలేదని ఆమె స్పష్టం చేశారు.

'నాకు బ్యాడ్‌గా అనిపించలేదు'

అభిమాని తన బుగ్గలను పట్టుకున్న విధానం తనకు చెడుగా అనిపించలేదని రచిత తెలిపారు. చిన్నపిల్లల బుగ్గలను ప్రేమగా పట్టుకున్నట్టుగానే తనకు అనిపించిందని చెప్పారు. అందుకే ఆ సమయంలో తనకు కోపం (ూఅస్త్రవతీ) కూడా రాలేదని ఆమె పేర్కొన్నారు. "అది బ్యాడ్ టచ్ (ధ్ఖిఎ ఎశీబఎష్ట్ర) కాదు.. ప్యూర్ లవ్ (్రబతీవ ాశీజవ)తో అలా చేశారు. అందుకే నాకు కోపం రాలేదు" అని రచిత రామ్ స్పష్టం చేశారు.

అల సంద్రవంకోలే వున్నావే పిల్లా..



నరేశ్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, 'రాజ్ వెడ్స్ రాంబాయి'ఫేమ్ అఖిల్ ఉద్దెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం'(. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్‌పై బూసం జగన్‌మోహన్‌రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు భద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. శనివారం ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'అల సెంద్రవంక' లిరికల్ సాంగ్ విడుదలైంది. 'ఓ అలసంద్రవంకోలే వున్నావే పిల్లా.. ఇలవాలికి మెరిసిందే నీ అందం వల్ల..' అంటూ సాగుతోందీ గీతం. గంధం కురిసే పిల్లా నీ మేని సొగసులనే చూసి.. వేకువలోనా వెన్నెల కాని, పిల్లా నీ పెదవులపై నవ్వు పూసే.. నీ అడుగులతోనే అవనే పులకించే.. నీ తనువును తాక మేఘం తలవంచే.. సింగిడి రంగులతో పొంగే ఆకాశం.. నీ ఒంటికి చీరై నిగనిగ మెరిసిందా..' అనే సాగి ఈ పాటకు అదనపు ఆకర్షణ తీసుకొచ్చింది. సురేశ్ బొబ్బిలి స్వరపర్చిన ఈ పాటకు జీ వెంకన్న రాయగా, అనురాగ్ కులకర్ణి పాడారు. ఈ చిత్రానికి డీవోపీ: శ్యామ్ దూపాటి; సంగీతం: సురేశ్ బొబ్బిలి; లిరిక్స్: గోరటి వెంకన్న, చైతన్యప్రసాద్, కాసర్ల శ్యామ్; యాక్షన్: డ్రాగన్ ప్రకాశ్; ఎడిటర్: శ్రావణ్ కటికనేని; ఆర్ట్: సాయి కదిర.

వికృత చేష్టలతో కలవరం!

ప్రస్తుతం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(కంటెంట్ వైరల్ అవుతోంది. అయితే, ఏఐ టెక్నాలజీ ద్వారా కొందరు సెలబ్రిటీల వీడియోలు, ఫొటోలు దుర్వినియోగం చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా ఏఐని ఉపయోగించి హీరోహీరోయిన్ల వీడియోలు, ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేయడం ఇటీవల విఫరీతమైంది. తాజాగా 'దేవర' చిత్రంలోని 'చుట్టమల్లే..' పాటను ఏఐ ఉపయోగించి అసభ్యంగా సృష్టించడం సినీవర్గాల్లో దుమారం రేపింది.ఈ ఘటనపై ఆ సినిమా హీరోయిన్ జాన్వీకపూర్ స్పందిస్తూ, తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. "ఏఐ టెక్నాలజీని ఇలా దుర్వినియోగం చేయడం కలవరపాటుకు గురిచేస్తోంది. ఏఐ ద్వారా సృష్టించిన ఇలాంటి నకిలీ వీడియోలను దయచేసి ఎవరూ ఇతరులతో షేర్ చేయవద్దు. ఇది ఏఐ టెక్నాలజీని స్పష్టంగా దుర్వినియోగం చేయడమే. ఈ వికృత చేష్టలకు పాల్పడిన వారిపై ఖచ్చితంగా తీవ్రమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అంటూ ఎక్స్ వేదికగా గట్టి హెచ్చరిక జారీ చేసింది జాన్వీ. సినిమాలు చూడండిఇదే విషయమై హీరో ఎన్టీఆర్ కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని వదిలిపెట్టేది



లేదు' అంటూ హెచ్చరించారు. "ఇది అత్యంత అసహ్యకరమైన చర్య. మహిళలను తల్లులుగా, దేవతలుగా పూజించే నేల మనది. మాతృదేవోభవ అనే నినాదం మన సంస్కృతిలో భాగమైన చోట కొందరు అత్యంత దిగజారి ప్రవర్తిస్తున్నారు. ఒక మహిళను అవమానించేలా ఏఐని దుర్వినియోగం చేస్తూ ఇలాంటి నీచమైన కంటెంట్‌ను సృష్టించడం సిగ్గుచేటు. 'చుట్టమల్లే..' పాట మార్ఫింగ్ వీడియో వెనుక ఉన్న నీచులెవరినీ వదిలిపెట్టను" అని హెచ్చరించారు ఎన్టీఆర్.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.